

పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 2 సంచిక : 83 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | బుధవారం 25 నవంబర్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :83 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : ONGOLE | WED 25 NOVEMBER 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావం..

ఏపీలో నేడు కూడా వర్షాలు

- ఏపీలో రానున్న నాలుగు రోజులు వర్షాలు
- పిడుగులు పడే అవకాశం ఉండటంతో అధికారుల హెచ్చరిక
- నేడు పలు జిల్లాల్లో మోస్తరు వర్ష సూచన
- ఉరుముల సమయంలో చెట్ల కింద ఉండవద్దని సూచన



- మిగతా 2లో

వావ్ నీ సంకల్పానికి ఆ విధి సైతం చప్పట్లు కొట్టాల్సిందే

పెన్ పవర్ డెస్క్: ఏపీ మంత్రి నారా లోకేశ్ ఓ ఆసక్తికర వీడియోను పోస్టు చేశారు. ఆత్మవిశ్వాసానికి నిలువెత్తు దర్పణంలా నిలిచే ఓ దివ్యాంగుడి ప్రతిభను ప్రశంసించారు. దివ్యాంగుడైన మనోహర్ డ్యాన్స్ వీడియోని సామాజిక మాధ్యమాల్లో చూసిన మంత్రి లోకేశ్.. అతడి గురించి వివరాలను ఆరా తీసి ప్రతిభను ప్రశంసిస్తూ 'ఎక్స్'లో వీడియోని పోస్టు పెట్టారు. "నీ సంకల్పానికి ఆ విధి సైతం



- మిగతా 2లో



పసిఫిక్‌లో పెను ముప్పు..

10 డిగ్రీలు పెరిగిన వేడి!

మెగా ఎల్‌నినోతో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగే ప్రమాదం

- గాలాపగోస్ దీవుల వద్ద అసాధారణంగా పెరిగిన సముద్రపు వేడి
- కొన్ని ప్రాంతాల్లో 10 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతల నమోదు
- తీవ్రరూపం దాల్చుతున్న ఎల్ నినో ప్రభావమే కారణమని వెల్లడి
- దీన్ని 'మెగా ఎల్ నినో'గా అభివర్ణించిన అమెరికా వాతావరణ నిపుణులు
- గత రికార్డులను బద్దలు కొట్టవచ్చని హెచ్చరించిన నోవా, డబ్ల్యూఎంవో

- మిగతా 2లో

ఏపీలో వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది మృతి..

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి



- విజయనగరం, విశాఖ, పల్నాడు జిల్లాల్లో జరిగిన ఘటనలు
- మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు సంతాపం
- ప్రమాద కారణాలపై విశ్లేషణ చేసి, చర్యలు తీసుకోవాలని ఆదేశం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచన

పెన్ పవర్ డెస్క్:ఏపీలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 8 మంది మృతి చెందడంపై సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉదయం విజయనగరం, విశాఖపట్నం, పల్నాడు జిల్లాల్లో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఓ వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో నలుగురు అక్కడికక్కడే మరణించారు. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడమే ఈ ప్రమాదానికి ప్రాథమిక కారణంగా అధికారులు సీఎంకు వివరించారు. ఈ ఘటనలో గాయపడిన వ్యక్తికి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.విశాఖ జిల్లా ఆనందపురం మండలం బాటజంగాలపాలెం టోల్‌గేట్ వద్ద జరిగిన మరో ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో మంటలు చెలరేగి డ్రైవర్, క్లీనర్ సజీవ దహనమయ్యారు. ఇక, పల్నాడు జిల్లా క్రోసూరు మండలంలో అమరావతిలో దర్శనం ముగించుకుని తిరిగి వస్తున్న అయ్యప్ప భక్తుల కారు, డ్రైవర్ నిద్రమత్తు కారణంగా అదుపుతప్పి కాలువలో పడిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు భక్తులు ప్రాణాలు కోల్పోగా, మరొకరు గాయపడ్డారు.ఈ మూడు ఘటనలపై సమగ్ర సమీక్ష జరపాలని పోలీస్, రవాణా శాఖ అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ప్రమాదాల కట్టడికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన ఆదేశించారు.

మత్స్యకారుల బోటు ఆచూకీ కోసం

గాలింపు ముమ్మరం చేయాలి

అమరావతి: సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల బోటు ఆచూకీ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. గాలింపు చర్యలపై అధికారులతో మాట్లాడి తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బోటును గుర్తించేందుకు మరింత విస్తృతంగా గాలింపు చేపట్టాలని ఆదేశించారు. కాకినాడ జిల్లా ఉప్పాడకు చెందిన ఏడుగురు మత్స్యకారులు నవంబర్ 4న మోటరైజ్డ్ ఫిషింగ్ బోటులో వేటకు వెళ్లారు. పారాదీప్ పోర్టు సమీపానికి చేరుకున్నాక వారి నుంచి సమాచారం నిలిచిపోయింది. ఈ నెల 19 నుంచి బోటుతో సంబంధాలు తెగిపోయాయి. మొబైల్ ఫోన్లు, బోటులోని ట్రాన్స్‌పాండర్ స్విచ్

- మిగతా 2లో

1,008 కిలోల నెయ్యి, 1503 మీటర్ల వత్తి..

కనువిందు చేసిన కార్తిక మహాదీపం



పెన్ పవర్ డెస్క్: కార్తిక పౌర్ణమి పర్వదినాన యోగుల పర్వతం కైలాసాన్ని తలపించింది. చీకట్లను చీలుస్తూ ఎగసిన మహాదీపం వెలుగులు భక్తుల హృదయాల్లో ఆధ్యాత్మిక పారవశ్యాన్ని నింపాయి. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వెనుక ఉన్న ఈ పవిత్ర గిరిపై మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మహాదీపోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఏక వీర సేవా

- మిగతా 2లో



హిజాబ్ లేకుండా పాట..

గాయనికి 74 కొరడా దెబ్బలు!

ఇరాన్‌లో గాయని పరస్తూ అహ్మదీపై శిక్ష అమలు

ఇరాన్‌లో మహిళల అణచివేత మరోసారి చర్చనీయాంశంగా మారింది. హిజాబ్ ధరించకుండా పాట పాడిన గాయనికి అక్కడి అధికారులు 74 కొరడా దెబ్బల శిక్ష అమలు చేశారు.

- మిగతా 2లో

కాశీ తరహాలో రాజమహేంద్రవరాన్ని

అభివృద్ధి చేస్తాం

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



పెన్ పవర్ డెస్క్: ఆధ్యాత్మిక రాజధానిగా ఉన్న రాజమహేంద్రవరం నగరాన్ని కాశీ తరహాలో అభివృద్ధి చేసేలా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. నగరానికి బంగారు భవిష్యత్తు ఇస్తామన్నారు. చారిత్రక, వారసత్వ నగరం సమగ్ర అభివృద్ధి కోసం మంచి ప్రణాళిక

- మిగతా 2లో



రష్యాకు యుద్ధ దెబ్బ.. 4.9 లక్షల మంది మృతి?

లీకైన ప్రభుత్వ రికార్డుల విశ్లేషణలో వెలుగులోకి వచ్చిన ప్రాణనష్టం అంచనాలు

పెన్ పవర్ డెస్క్:ఉక్రెయిన్‌పై ఐదేళ్ల క్రితం రష్యా మొదలుపెట్టిన యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. 2022లో దురాక్రమణ ప్రారంభించినప్పటి నుంచి కనీసం 4.9లక్షల మంది రష్యా సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. వీరిలో కొన్ని వేల మంది 18 ఏళ్ల వయసువారే ఉండటం కలవరపెట్టే విషయం. మరోవైపు, ఐదేళ్ల కాలంలో

- మిగతా 2లో

సెప్టిక్ ట్యాంక్‌లో మృత్యుపాశం..

ముగ్గురు బలి!

విషవాయువులు పీల్చి ప్రాణాలు కోల్పోయిన శ్రీకాకుళం యువకులు

- బాచుపల్లి దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్‌లో ఘటన
- సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ చేస్తూ ముగ్గురు కార్మికులు మృతి
- విషవాయువులు పీల్చి ఊపిరాడక ప్రాణాలు కోల్పోయిన వైనం
- మృతులు శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారిగా గుర్తింపు
- మృతదేహాలను బయటకు తీసిన హైడ్రా, ఫైర్ సిబ్బంది

- మిగతా 2లో



బాబాయ్‌ను దొంగ అన్నాడని.. క్లాస్‌మేట్ చెంప పగలగొట్టా!

చిన్ననాటి ఘటనను గుర్తు చేసుకున్న ప్రియాంకా గాంధీ



పెన్ పవర్ డెస్క్:కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా తమ పాఠశాల రోజుల నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. 1977 నాటి ఎమర్జెన్సీ అనంతరం తమ కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితులు, ఆ సమయంలో పాఠశాలలో ఎదురైన అనుభవాలను వారు తాజా వీడియో సంభాషణలో గుర్తు చేసుకున్నారు.తమ తల్లి, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ

- మిగతా 2లో

ఆస్తులు తీసుకుని.. వదిలేస్తే జైలుకే!

తల్లిదండ్రులను పట్టించుకోని సంతానానికి మూడేళ్ల శిక్ష.. కేరళలో కొత్త చట్టం



- మిగతా 2లో



"సేన" సైకిల్ కు దూరమవుతుందా?

స్థానిక సంస్థల ఎన్నికలు దాదాపుగా ముగిశాయి. పంచాయతీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కూటమి పార్టీల మధ్య ఉండదు. అయితే కూటమిలో స్థానిక సంస్థల ఎన్నికలు ఒకరకంగా చిచ్చుపెట్టాయనే చెప్పాలి. ప్రధానంగా మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతల్లో అసంతృప్తి అయితే క్రమంగా బయటపడుతుంది. జనసేనలో పై స్థాయి నేతలు చంద్రబాబుకు అనుకూలంగా ఉన్నప్పటికీ కింది స్థాయిలో మాత్రం నేతలు పార్టీ నిర్ణయం పట్ల ఒకింత అసంతృప్తితోనే ఉన్నారు.సీట్ల సర్దుబాటు, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని ఛైర్మన్లు, వైస్ ఛైర్లన్లు చేయడం కూడా జనసేన ద్వితీయ శ్రేణి నేతలకు మింగుడుపడటం లేదు. అధికారంలో ఉన్నారు కాబట్టి జనసేన కింది స్థాయి నేతలు ఇప్పుడు బయట పడటం లేదు. కానీ రానున్న కాలంలో జనసేనను నమ్ముకుంటే తమకు పదవులు రావన్న విషయం అర్థమయి వారు పార్టీకి దూరమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా తమ అసంతృప్తిని బయటపెడుతున్నారు.

క్యాడర్ మాత్రం...

పవన్ కల్యాణ్ , జనసేన మంత్రుల విషయంలో సాఫ్ట్ కార్నర్ గా ఉంటే సరిపోదు. కింది స్థాయిలో నేతలు మాత్రం తాము అన్యాయానికి గురవుతున్నారన్న భావనలో ఉన్నారు. ప్రధానంగా జనసేన, టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం ఉన్న చోట కూడా జనసేన క్యాడర్ కు న్యాయం జరగడం లేదు. జనసేన కార్యకర్తలను దూరం పెడుతూ వస్తున్నారని, జనసేన టీడీపీ మధ్య గ్రౌండ్ లెవెల్లో చీలికలు స్టార్ట్ అయ్యాయని లీడర్లే సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని చోట్ల డైరెక్ట్ తిరుగుబాట్లు మొదలయ్యాయి. పంచాయతీ ఎన్నికల నాటికి ఇవి పీక్స్ లోకి చేరాయి. ఏ స్థాయికి వచ్చాయి అంటే ఆఖరి దశలో ఏకంగా జనసేన పార్టీ ఆఫీసియల్ గా స్వేచ్ఛగా పోటీ చేసుకోండి అని లెటర్ విడుదల చేసింది. కానీ అప్పటికే డ్యామేజ్ అయిపోయింది. లాస్ట్ మూమెంట్ లో ఆర్డర్ వచ్చినా టీడీపీ వాళ్ళు కనీసం నామినేషన్ కూడా వెయ్యనివ్వడం పోవడం చర్చనీయాంశమైంది.

చివరకు పిఠాపురంలోనూ...

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం వైస్ ఛైర్మన్ ఎన్నిక లో కూడా గందరగోళం నెలకొంది. కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అనుచరుడు చక్రిపై జనసేన నేతలు దాడి చేశారు.పిఠాపురం వైస్ ఛైర్మన్ పదవి కోసం కౌన్సిలర్లు బొజ్జ వెంకటేశ్వరరావు, పిండి సంధ్యాల మధ్య పోటీ నెలకొంది. వైసీపీ నుంచి వచ్చిన బొజ్జ శ్రీనివాస్ పేరును ఖరారు చేయడంతో స్థానిక జనసేన నేతలు మండిపడుతున్నారు. స్థానిక నాయకత్వం పవన్ కల్యాణ్ ను తప్పుదోవపట్టించి వైసీపీ, టీడీపీ నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పార్టీ విప్‌ను ధిక్కరించవద్దంటూ కౌన్సిలర్లతో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మంతనాలు జరిపారు. ఏకగ్రీవంగా వైస్ ఛైర్మన్ బొజ్జ వెంకటేశ్వరరావు ఎన్నిక పూర్తయింది.ఈ నేపద్యంలో జనసేన మళ్ళీ టీడీపీకి 2024 స్థాయి మద్దతు ఇవ్వడానికి క్యాడర్ సిద్ధంగా లేదని చెబుతున్నారు. బీజేపీ జమ్మల మడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి అసంతృప్తిని ప్రకటించగా, తాజాగా విశాఖ బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కూడా డిప్యూటీ మేయర్ తమకు ఇవ్వకపోవడాన్ని తప్పుపట్టారు.

వావ్ నీ సంకల్పానికి ఆ విధి సైతం చప్పట్లు కొట్టాల్సిందే

- మొదటి పేజి తరువాయి

చప్పట్లు కొట్టి అభినందించాల్సిందే మనోహర్. నీ ఆత్మవిశ్వాసం ఓ అద్భుతం. సోషల్ మీడియాలో నీ డాన్స్ వీడియో చూసి వివరాలు తెలుసుకున్నాను. నాటు నాటు పాటకు డ్యాన్సే కాదు.. మనోహర్ షాట్ పుట్ అథ్లెట్, పాటలు కూడా పాడతాడట. ఆర్డీటీలో మనోహర్ లాంటి వందలాది దివ్యాంగులకు నైతిక విలువలతో కూడిన విద్య, క్రీడలు, జీవన నైపుణ్యాలు నేర్పిస్తున్నారని తెలిసి సంతోషించాను. ఆకాశమే హద్దుగా ప్రయత్నిస్తున్న మీరు బాలబాలికల భవిష్యత్తుకు వెలుగు దీపికలు. నిండైన ఆత్మవిశ్వాసపు ప్రతీకలు.. మీ ప్రతిభ అనన్య సామాన్యం. మీ అందరికీ అభినందనలు, ఆశీస్సులు" అని పేర్కొన్నారు.

మత్స్యకారుల బోటు ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేయాలి

- మొదటి పేజి తరువాయి

ఆఫ్ కావడంతో జీపీఎస్ ద్వారా కూడా ఆచూకీ లభించలేదు. కాకినాడ, చెన్నై, ఒడిశా కోస్ట్‌గార్డ్ అధికారుల సమన్వయంతో గాలింపు కొనసాగుతోంది. భారత కోస్ట్‌గార్డ్ నౌకలు, హెలికాప్టర్లతో పారాదీప్ తీరంలో గాలిస్తున్నారు. మత్స్యకారుల కుటుంబాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ.. గాలింపు పురోగతిని వారికి తెలియజేయాలని చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు.

కాశీ తరహాలో రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేస్తాం

- మొదటి పేజి తరువాయి

రూపొందించామని రానున్న రోజుల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. నగర అభివృద్ధిపై రూపొందించిన ప్రత్యేక మేనిఫెస్టోను రాజమహేంద్రవరంలో విడుదల చేశారు. తెదేపా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, భాజపా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జనసేన, బీజేపీ నేతలు కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరంలో ఉన్న ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరం శివారు ప్రాంతాలన్నింటికీ తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ట్రాపిక్ సమస్య నివారణకు రోడ్ల అభివృద్ధి సహా రూ.89 కోట్లతో హ్యావలాక్ బ్రిడ్జిని అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. దేవాలయాల అభివృద్ధికి ఇప్పటికే రూ.100 కోట్లతో ప్రసాదం స్కీమ్ కింద నిధులు తెచ్చినట్లు తెలిపారు. వైకాపాకి ఓటు వేస్తే.. దుర్వినియోగం అయినట్లేనని వ్యాఖ్యానించారు. గోదావరిని స్వచ్ఛ గోదావరిగా మార్చడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రాజెక్టు తీసుకువస్తామన్నారు. గతంలో వైకాపా విధ్వంసకర పాలన అందించిందని, కూటమి ప్రభుత్వం రాకతో అభివృద్ధి వైపు రాజమహేంద్రవరం అడుగులు వేస్తోందని నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

బంగాళాఖాతంలో ద్రోణి ప్రభావం.. ఏపీలో నేడు కూడా వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రానున్న నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) వెల్లడించింది. వర్షాలతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఏపీలో ఇవాళ పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ప్రకాశం జిల్లా ఒంగోలులో రోడ్లపై మోకాలి లోతున నీరు నిలిచింది. నెల్లూరులోనూ వర్షపాతం నమోదైంది.వాతావరణ శాఖ వివరాల ప్రకారం, నైరుతి బంగాళాఖాతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు తూర్పు గాలుల ద్రోణి విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ముఖ్యంగా పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే వీలుంది. వీటితో పాటు మిగిలిన జిల్లాల్లోనూ అక్కడక్కడ చెదురుమదురు జల్లులు పడే అవకాశముందని అధికారులు తెలిపారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఈ మార్పుల దృష్ట్యా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులు వీచే సమయంలో ప్రజలు ఎవరూ చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో ఉండవద్దని స్పష్టం చేసింది. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు వర్షం పడే సమయంలో సురక్షితమైన భవనాల్లో ఆశ్రయం పొందాలని విజ్ఞప్తి చేసింది. అత్యవసరమైతే తప్ప వర్షం, పిడుగుల సమయంలో బయటకు రావద్దని సూచించింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, అధికారులు ఎప్పటికప్పుడు తాజా వాతావరణ హెచ్చరికలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

పసిఫిక్‌లో పెను ముప్పు.. 10 డిగ్రీలు పెరిగిన వేడి!

పసిఫిక్ మహాసముద్రంలో అసాధారణ వాతావరణ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. గాలాపగోస్ దీవులు, పెరూ తీరానికి సమీపంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే ఏకంగా 10 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తీవ్రరూపం దాల్చుతున్న ఎల్ నినో ప్రభావమే ఇందుకు కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

అమెరికాకు చెందిన ప్రముఖ వాతావరణ శాస్త్రవేత్త ర్యాన్ మౌ, ఈ పరిణామాన్ని 'మెగా ఎల్ నినో'గా అభివర్ణించారు. యూరోపియన్ సెంటర్ ఫర్ మీడియం-రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్స్ (ఈసీఎండబ్ల్యూఎఫ్) డేటా ఆధారంగా రూపొందించిన మ్యాప్‌ను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. అయితే, ఈ తీవ్రమైన వేడి పసిఫిక్‌లోని తూర్పు ప్రాంతంలోని ఒక హాట్‌స్పాట్‌కు మాత్రమే పరిమితమైందని, మొత్తం పసిఫిక్ మహాసముద్రం 10 డిగ్రీలు వేడెక్కిందని దీని అర్థం కాదని నిపుణులు వివరిస్తున్నారు. పసిఫిక్‌లోని విస్తృత మధ్య ప్రాంతాల్లో సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఈ ఎల్ నినో గణనీయంగా బలపడిందని అమెరికాకు చెందిన నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఓఏఏ) కూడా ధ్రువీకరించింది. 1950 నుంచి నమోదైన ఎల్ నినో రికార్డులను ఇది అధిగమించే అవకాశం 60% ఉందని ఎన్ఓఏఏ అంచనా వేస్తోంది. ముఖ్యంగా 1997-98, 2015-16 నాటి శక్తిమంతమైన ఎల్ నినోలను ఇది మించిపోవచ్చని పేర్కొంది. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. చరిత్రలో నమోదైన అత్యంత శక్తిమంతమైన ఎల్ నినోలలో ఇది ఒకటిగా నిలవొచ్చని తెలిపింది.ఈ ఎల్ నినో ప్రభావం 2027 ప్రారంభం వరకు కొనసాగే అవకాశం ఉందని, దీనివల్ల రాబోయే నెలల్లో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని డబ్ల్యూఎంవో హెచ్చరించింది. ఎల్ నినో సమయంలో ఉష్ణమండల సముద్రంలో నిల్వ ఉన్న వేడి వాతావరణంలోకి విడుదల కావడమే ఇందుకు కారణమని వివరించింది. కాగా, గత అక్టోబర్‌లోనే పెరూ తీరం, గాలాపగోస్ పశ్చిమ జలాల్లో 6 నుంచి 7 డిగ్రీల ఉష్ణోగ్రత పెరుగుదల కనిపించిందని యూరోపియన్ యూనియన్‌కు చెందిన కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ డేటా వెల్లడించింది.

సెప్టిక్ ట్యాంక్‌లో మృత్యుపాశం.. ముగ్గురు బలి!

హైదరాబాద్‌లోని బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ అపార్ట్‌మెంట్‌లోని సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు లోపలికి దిగిన ముగ్గురు కార్మికులు విషవాయువులు పీల్చి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బాచుపల్లి పరిధిలోని ఏపీఆర్ ఎన్‌క్లేవ్, దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్‌లో ఈ దుర్ఘటన జరిగింది. మృతులను శ్రీకాకుళం జిల్లాకు చెందిన పవన్ యల్లా (20), కె.షణ్ముఖరావు అలియాస్ సుమన్ (26), సురేష్ (24)గా గుర్తించారు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన ముగ్గురు యువకులు ఇలా అర్ధాంతరంగా మృతి చెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర శోకం అలుముకుంది.దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్ యాజమాన్య సంఘానికి, 'హెచ్ఆర్ ఇన్విరో' అనే ప్రైవేట్ కాంట్రాక్టు సంస్థకు మధ్య సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే పనులకు సంబంధించి ఒప్పందం ఉంది. అపార్ట్‌మెంట్ ప్రతినిధుల అభ్యర్థన మేరకు సదరు సంస్థ సిబ్బంది తరచూ ఇక్కడ క్లీనింగ్ పనులు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా హెచ్ఆర్ ఇన్విరో సంస్థకు చెందిన ముగ్గురు కార్మికులు సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయడానికి అపార్ట్‌మెంట్‌కు వచ్చారు. పని ప్రారంభించే క్రమంలో ఒకరి తర్వాత ఒకరు ట్యాంకు లోపలికి దిగారు. అయితే ట్యాంక్ లోపల తీవ్రమైన విషవాయువులు పేరుకుపోయి ఉండటంతో వారు ఊపిరాడక స్పృహతప్పి పడిపోయారు. ఎంతసేపటికీ వారు బయటకు రాకపోవడంతో తోటి సిబ్బంది, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురై పోలీసులకు, అత్యవసర విభాగాలకు

సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే హైడ్రా ఎస్ఎఫ్ఓ శ్రీనివాస్ నేతృత్వంలోని డీఆర్ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలు, అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్యాంక్ లోపల దట్టమైన విషవాయువులు వ్యాపించి ఉండటంతో సహాయక చర్యలు క్లిష్టంగా మారాయి. అయినప్పటికీ హైడ్రా, ఫైర్ సిబ్బంది సంయుక్తంగా శ్రమించి, పాతాళకాంత వంటి ప్రత్యేక రెస్క్యూ పరికరాల సాయంతో ముగ్గురి మృతదేహాలను ట్యాంక్ నుంచి బయటకు తీశారు.

సెప్టిక్ ట్యాంక్‌లో నిల్వ ఉన్న ప్రమాదకరమైన విషపూరిత వాయువులను పీల్చడం వల్లే ఊపిరాడక వారు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న బాచుపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఈ పనుల్లో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రష్యాకు యుద్ధ దెబ్బ.. 4.9 లక్షల మంది మృతి?

- మొదటి పేజి తరువాయి

కొందరు సైనికులు బలవన్మరణానికీ పాల్పడినట్లు తేలింది. రష్యాలో ఇటీవల లీకైన ప్రభుత్వ రికార్డులను విశ్లేషించిన కొన్ని మీడియా సంస్థలు ప్రాణనష్ట అంచనాలను వెల్లడించాయి.దేశంలో జనన, మరణాలకు సంబంధించిన రికార్డులను నమోదు చేసే ఫెడరల్ స్టేట్ స్టాటిస్టిక్స్ సర్వీస్ ఏజెన్సీ డేటా ఇటీవల హ్యాకింగ్‌కు గురైంది. లీకైన డేటాలో జనవరి 2021 నుంచి సెప్టెంబర్ 2026 వరకు నమోదైన లక్షలాది పౌరుల మరణ ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి. వీటిని విశ్లేషించిన స్థానిక మీడియా సంస్థలు.. ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నాటికే కనీసం 4.9లక్షల మంది రష్యన్ సైనికులు మరణించినట్లు గుర్తించాయి. మరణాల నమోదులో జాప్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ సంఖ్య 7లక్షల వరకు ఉండే అవకాశం ఉందని అంచనా వేశాయి.ఈ రికార్డులను ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల గణాంకాలతో పోల్చి చూశామని, ఇవన్నీ సరైనవేనని ధ్రువీకరించుకున్నట్లు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. మరణించిన రష్యన్ సైనికుల సగటు వయసు 2022లో 33గా ఉండగా.. 2026లో 40గా ఉన్నట్లు తెలిపాయి. చనిపోయిన వారిలో దాదాపు 7వేల మంది వయసు 18-19గా గుర్తించినట్లు చెప్పాయి. అయితే, వీరంతా నిర్బంధ సైనిక సేవకులే కావచ్చని అంచనా వేశాయి.

వందలాది ఆత్మహత్యలు..?

మరోవైపు, ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా అనేక మంది రష్యన్ సైనికులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు తెలిసింది. ఈ ఐదేళ్ల కాలంలో సుమారు 1229 మంది సైనికులు బలవన్మరణాలకు పాల్పడినట్లు అంచనా. వీరిలో సగం మంది సరిహద్దు ప్రాంతాల్లోనే చనిపోయినట్లు భావిస్తున్నారు. ఇవన్నీ సైనిక శిబిరాలు, శిక్షణా కేంద్రాలు, ప్రైవేటు నివాసాల్లో చోటుచేసుకున్నట్లు వార్తా సంస్థల విశ్లేషణలో తేలింది. యుద్ధంలోకి పంపే విషయంలో ఒప్పందాలపై సంతకాలు చేయాలని తీవ్ర ఒత్తిడి చేయడమే బలవన్మరణాలకు ప్రధాన కారణంగా అనుమానిస్తున్నారు.ఇదిలాఉంటే, యుద్ధంలో ప్రాణ నష్టానికి సంబంధించి రష్యా చివరిసారిగా 2022లో గణంకాలను విడుదల చేసింది. ఉక్రెయిన్‌పై యుద్ధం మొదలైన తర్వాత పూర్తి వివరాలు వెల్లడించలేదు. వీటిపై వచ్చే స్వతంత్ర నివేదికలకు విశ్వసనీయత లేదని రష్యా ప్రభుత్వం చెబుతోంది. రోస్టాట్ నుంచి కూడా డేటా లీక్ కాలేదని చెప్పడం గమనార్హం.

హిజాబ్ లేకుండా పాట.. గాయనికి 74 కొరడా దెబ్బలు!

- మొదటి పేజి తరువాయి

యూట్యూబ్‌లో నిర్వహించిన సంగీత ప్రదర్శనలో ఆమె హిజాబ్ లేకుండా కనిపించడమే ఇందుకు కారణం.ఇరాన్‌కు చెందిన ప్రముఖ గాయని పరస్తూ అహ్మదీ ఈ శిక్షకు గురయ్యారు. 2024 డిసెంబర్‌లో ఖోమ్ నగరంలో ఆమె సంగీత ప్రదర్శన ఇచ్చారు. నలుగురు గాయకులతో కలిసి హిజాబ్ లేకుండా పాటలు పాడారు. ఆ సమయంలో అక్కడ ప్రేక్షకులు కూడా ఎవరూ లేరు. ఈ ప్రదర్శనకు సంబంధించిన వీడియోను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయగా మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఇరాన్ న్యాయస్థానం.. అహ్మదీతో పాటు ఆమె బృందంలోని వారికి ఒక్కొక్కరికి 74 కొరడా దెబ్బల శిక్ష విధించింది. అంతేకాదు.. రెండేళ్ల పాటు విదేశీ ప్రయాణాలు, కళా, సంగీత కార్యకలాపాలపై నిషేధం విధించింది. తాజాగా నవంబర్ 23న గాయని అహ్మదీతో పాటు నలుగురు బృంద సభ్యులకు 74 కొరడా దెబ్బల శిక్ష అమలు చేసినట్లు అంతర్జాతీయ మీడియా వెల్లడించింది. కాగా.. అమినీ అనే యువతి 2022లో హిజాబ్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలతో నైతిక పోలీసులు (వీశీఝీశ్రీఱ్ఎ ౨ాశీశ్రీఱఎవ) అదుపులోకి తీసుకోగా.. కస్టడీలో మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత ఇరాన్‌లో మహిళల హక్కులపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజా ఘటన మరోసారి అంతర్జాతీయంగా చర్చకు దారితీసింది. మహిళల వస్త్రధారణ, భావప్రకటనా స్వేచ్ఛపై ఇరాన్‌లో కొనసాగుతోన్న ఆంక్షలకు ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచింది.

ఆస్తులు తీసుకుని.. వదిలేస్తే జైలుకే!

తల్లిదండ్రుల నుంచి ఆస్తులు రాయించుకుని, ఆ తర్వాత వారిని పట్టించుకోకుండా గాలికొదిలేసే పిల్లలకు కేరళం ప్రభుత్వం గట్టి హెచ్చరిక జారీ చేసింది. అలాంటి బాధ్యతారహిత సంతానానికి ఏకంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా కొత్త చట్టాన్ని తీసుకొచ్చినట్లు కేరళం ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ సంచలన ప్రకటన చేశారు. సీనియర్ సిటిజన్ల సంరక్షణ, హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర అసెంబ్లీ అక్టోబర్‌లో ఆమోదించిన నూతన బిల్లులో ఈ కీలక నిబంధనను చేర్చినట్లు స్పష్టం చేశారు. కొల్లం సమీపంలోని పతనపురంలో గల గాంధీభవన్‌లో రూ.20 కోట్ల వ్యయంతో వృద్ధుల కోసం అత్యాధునిక వసతులతో నిర్మించిన 'పితృమందిరం' నివాస సముదాయాన్ని ప్రారంభించిన సందర్భంగా ఈ వివరాలు వెల్లడించారు.యూడీఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తీసుకున్న తొలి నిర్ణయం వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయడమేనని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే ఇలాంటి శాఖను నెలకొల్పిన తొలి రాష్ట్రం కేరళం అని పేర్కొన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా వయోవృద్ధులకు పలు విశేష హక్కులను కల్పిస్తూ సమగ్ర చట్టాన్ని తెచ్చామని వివరించారు. గవర్నర్ ఆమోదం లభించి ఈ చట్టం పూర్తిస్థాయిలో అమల్లోకి రాగానే, తల్లిదండ్రులను మోసం చేసే పిల్లలను కచ్చితంగా జైలుకు పంపుతామని, ఇందులో ఎలాంటి సందేహం అవసరం లేదని గట్టిగా చెప్పారు.పిల్లలను పెంచి పెద్ద చేయడానికి తల్లిదండ్రులు ఎంతటి కష్టాలు, త్యాగాలు భరిస్తారో సమాజం తెలుసుకోవాలని సతీశన్ ఉద్వేగంగా మాట్లాడారు. ఎదిగి పెద్ద స్థాయికి చేరిన తర్వాత కన్నవారిని అనాథలుగా వదిలేసే సంస్కృతి కేరళంలో ఉండకూడదని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను గుండెలకు హత్తుకుని చూసుకునే సరికొత్త సంస్కృతి సమాజంలో రావాలని, రాష్ట్రంలో ఏ ఒక్క వృద్ధుడూ ఒంటరి కాకూడదన్నదే తన ఆశయమని తెలిపారు. కాగా, ఈ పితృమందిరం నిర్మాణానికి పూర్తి ఆర్థిక సాయం అందించిన లులు గ్రూప్ ఛైర్మన్ ఎం.ఎ.యూసుఫ్ అలీని సీఎం కొనియాడారు. ఎంత సంపద ఉన్నా ఇతరులకు సాయం చేసే గొప్ప గుణం ఆయనకు ఉందని ప్రశంసించారు.

1,008 కిలోల నెయ్యి, 1503 మీటర్ల వత్తి..

- మొదటి పేజి తరువాయి

ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలిరావడంతో కొండ ప్రాంతం కిక్కిరిసిపోయింది. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల హరహర మహదేవ, శంభో శంకర నామస్మరణల మధ్య అఖండ దీపాన్ని వెలిగించారు. కొండపై ఏర్పాటు చేసిన ఆరు అడుగుల కొప్పెరలో 1008 కిలోల స్వచ్ఛమైన ఆవు నెయ్యి పోసి 1,503 మీటర్ల పొడవైన వత్తితో మహా దీపాన్ని ప్రజ్వలింపజేశారు. ఆ దివ్యజ్యోతి వెలుగులు సమీప గ్రామాల ప్రజలను కనువిందు చేశాయి. ఈ మహాక్రతువును కనులారా వీక్షించేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా భక్తులు భారీగా విచ్చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏకవీర సేవా ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక యువత అన్నదానం, తాగునీటి సౌకర్యాలు కల్పించారు.

బాబాయ్‌ను దొంగ అన్నాడని.. క్లాస్‌మేట్ చెంప పగలగొట్టా!

- మొదటి పేజి తరువాయి

రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకావిష్కరణ సందర్భంగా సోషల్ మీడియాలో ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఈ సంభాషణలో సోనియా గాంధీతో పాటు రాహుల్, ప్రియాంక పాల్గొన్నారు. 1977 ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఓటమి పాలైన తర్వాతి రోజులను ప్రియాంక ఈ సందర్భంగా ప్రస్తావించారు.ఆ సమయంలో పాఠశాలలో ఒక బాలుడు తన వద్దకు వచ్చి "తేరా చాచా జైల్ మే హై, చోర్ హై తేరా చాచా" (మీ బాబాయ్ జైల్లో ఉన్నాడు.. మీ బాబాయ్ ఒక దొంగ) అని సంజయ్ గాంధీని ఉద్దేశించి దూషించాడని ప్రియాంక తెలిపారు. ఆ మాట వినగానే తీవ్ర కోపంతో ఆ బాలుడి చెంప పగలగొట్టానని ఆమె చెప్పారు. దెబ్బ తిన్న ఆ పిల్లాడు ఏడుస్తూ టీచర్‌కు ఫిర్యాదు చేయడంతో, చివరకు తనకు చీవాట్లు పడ్డాయని ఆమె నవ్వుతూ గుర్తు చేసుకున్నారు.ఇదే క్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ఎమర్జెన్సీ ముగిసిన తర్వాత తనకూ పాఠశాలలో క్లిష్ట పరిస్థితులు ఎదురయ్యాయని వివరించారు. ఆ సమయంలో తరగతి గదిలో తన పక్కన కూర్చోవడానికి ఎవరూ ఇష్టపడలేదని తెలిపారు. అంతేకాకుండా, తన ఏడో పుట్టినరోజు వేడుకలకు స్నేహితులను ఆహ్వానించినప్పటికీ దాదాపు ఎవరూ రాలేదని ఆయన పేర్కొన్నారు.విద్యార్థులుగా తమ ఇద్దరి వ్యక్తిత్వాల మధ్య ఉన్న తేడాలను కూడా ఈ సందర్భంగా వారు వెల్లడించారు. తాను క్రమశిక్షణతో ఉంటూ, పాఠశాల నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించే వ్యక్తినని, స్కూల్ ప్రిఫెక్ట్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించానని ప్రియాంక చెప్పారు. మరోవైపు రాహుల్ మాత్రం తాను కాస్త తిరుగుబాటు ధోరణితో ఉండేవాడినని, ఉపాధ్యాయులను ఎక్కువగా ప్రశ్నలు అడుగుతూ క్లాస్‌లో కాస్త గందరగోళం సృష్టించేవాడినని సరదాగా అంగీకరించారు.కాగా, సోనియా గాంధీ రాసిన తాజా పుస్తకంలో ఎమర్జెన్సీ సమయంలో సంజయ్ గాంధీ పోషించిన పాత్ర, ఆ పరిణామాలపై ఇందిరా గాంధీలో కలిగిన భావనల వంటి పలు చారిత్రక కోణాలను స్పృశించారు. ప్రస్తుతం రాహుల్, ప్రియాంకల చిన్ననాటి ముచ్చట్లకు సంబంధించిన ఈ వీడియో నెట్టింట ఆసక్తికరంగా మారింది.

ఈవీఎం గోడౌన్‌ల తనిఖీ

ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ నవంబర్ 24

ఈవీఎం గోడౌన్ ల సాధారణ తనిఖీలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు భాగ్యనగర్ నాలుగో లైన్ లో గల ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను సాధారణ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ నిర్వహిస్తున్న బందోబస్తును పరిశీలించారు. విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోడౌన్ చుట్టూ ప్రతిష్ట బందోబస్తు నిర్వహించాలని ఆయన ఇతరులకు సూచించారు. భద్రత ఏర్పాట్లపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ, ఎలక్షన్ సెల్ సూపరిండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

కందుకూరులో కూటమి అభ్యర్థుల భారీ ర్యాలీ

-చైర్మన్‌తో పాటు 40 వార్డుల్లో విజయం సాధిస్తాం

-ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం





కందుకూరు పెన్ పవర్, నవంబర్ 24

కందుకూరు మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా మంగళవారం పట్టణంలో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంతో పట్టణ ప్రధాన రహదారులు జనసంద్రంగా మారాయి. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పిడికిటి వెంకటేశ్వర్లు, 40 వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు.టీడీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్, పోస్టాఫీస్ సెంటర్ మీదుగా కోవూరు రోడ్డు జంక్షన్ వరకు సాగింది. మూడు పార్టీల జెండాలు చేతబట్టి కార్యకర్తలు నినాదాలు చేస్తూ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ మార్గంలో పట్టణ ప్రజలు అభ్యర్థులకు స్వాగతం పలుకుతూ తమ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ 15 సంవత్సరాల తర్వాత కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు జరుగుతున్నాయని, పట్టణ అభివృద్ధికి అడ్డుపడ్డ వైసీపీకి ఈనెల 26న జరిగే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. గత రెండున్నరేళ్లలో సుమారు రూ.180 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, రోడ్ల విస్తరణ, డ్రైనేజీల నిర్మాణం, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. అమృత్ 2.0 పథకం ద్వారా రూ.30 కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించే కార్యక్రమం కొనసాగుతోందని, హామ్ పథకం కింద మరో రూ.40 కోట్ల నిధులు మంజూరయ్యాయని వివరించారు.అంకమ్మ ఆలయం చుట్టూ షాపులు నిర్మించి మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చామని, పేదలకు మూడు పూటలా భోజనం అందించే అన్న క్యాంటీన్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ అనేక ప్రయత్నాలు చేసిందని విమర్శించారు. మున్సిపాలిటీలో చైర్మన్ అభ్యర్థితో పాటు 40 మంది కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించి కూటమికి ఘనవిజయం అందించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

మాజీ ఎమ్మెల్యే దివి శివరాం మాట్లాడుతూ చైర్మన్ అభ్యర్థి పిడికిటి వెంకటేశ్వర్లు విజయం ఖాయమైందని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచే వెంకటేశ్వర్లుతో పాటు కౌన్సిలర్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఘట్టమనేని హరిబాబు మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. చైర్మన్ అభ్యర్థి పిడికిటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనను గెలిపిస్తే మున్సిపాలిటీ ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటానని, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సహకారంతో కందుకూరు మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, ఏపీఈడబ్ల్యూ ఐడి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, జనసేన నాయకులు కళ్యాణ్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి కిక్కిరిసిన శైవ క్షేత్రాలు

జ్వాలా తోరణం వెలిగించిన అర్చకులు

జిగేలు మంటున్న దీపాల వరసలు

ప్రత్యక పూజలు , దర్శనాలతో పరవశించిన భక్తులు

శివనామస్మరణ తో మార్మోగిన శైవాలయాలు

గిద్దలూరు పెన్ పవర్
నవంబర్ 24





కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శివాలయాలు కిక్కిరిసిపోయాయి. కార్తీక మాసం మహా శివునికి ప్రీతికరమైన మాసం.కార్తీక పౌర్ణమి శుక్లపక్షంలో వచ్చే 15 రోజు పున్నమి నాడు భక్తులు జరుపుకునే పవిత్ర పండుగ దీని దేవా దీపావళి ,త్రిపుర పూర్ణిమ అనికూడా అంటారు. కార్తీక పౌర్ణమి నాడు మహాశివుణ్ణి అభిషేకిస్తే పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయి అనే ప్రగాఢ విస్వాసం. అందుకే కార్తీక పౌర్ణమి కి భక్తులు శైవ క్షేత్రాలను దర్శించి మహాశివుణ్ణి అర్చించి, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించి, ఆలయాల్లో దీపాలు వెలిగించి పర్వతులౌతారు. మరికొందరు వంద , లక్ష వత్తులు వెలిగిస్తారు ఆలయాలు ఆ దీపపకాంతుల కు మెరిసి పోతాయి ఈరోజే ఆలయ అర్చకులు జ్వాలా దీపం వెలిగిస్తారు. కార్తీక పౌర్ణమి నాడు సాయం సమయంలో క్రొత్త గుడ్డను నూనెలో తడిపి అగ్నిజ్వాలలు వెలిగిస్తారు ఈ జ్వాలా క్రిందనుడి శివ పార్వతుల పల్లకి భక్తులు దాటితే సకలదోషాలు తొలగి పోతాయని విశ్వాసం. కార్తీక మాసం ప్రారంభంనుంచే మహిళలు సాయంత్రం ఇంటిముందు దీపాల వరుసలు పేర్చి భక్తి ప్రపత్తులు చాటుకుంటారు. కార్తీక పౌర్ణమి నాడు గిద్దలూరు ప్రాంతంలోని కేఎస్ పల్లి సమీపలోని భీమేశ్వర ఆలయానికి పట్టణంలో ని శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి ఆలయానికి, పాపులీడు సిద్ధిబైరేశ్వ ఆలయానికి, కనక సురబెశ్వర కోన, ముక్తేశ్వరం, రామాపురం సిద్ధిభైరవేశ్వర ఆలయాలకు భక్తులు తండోప తండాలుగా బయలు దేరివెళ్లారు శివనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి భక్తులకు తీర్థ ప్రసాదాల నిసంగారు ఆలయాల్లో దీపాలవరుసలు మురుమిట్లుకొలిపాయి.

సమర్థవంతంగాసంజీవని కార్యక్రమాన్ని అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు

- డిసెంబర్‌లో ట్రయల్ రన్ నిర్వహణ..

జనవరి 1 నుంచి ప్రజలకు సంజీవని వైద్య సేవలు అందించేలా చర్యలు

ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్
నవంబర్ 24



ప్రకాశం జిల్లాలో సంజీవని కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, పేద ప్రజలకు నిపుణులైన వైద్యుల సలహాలు, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సంజీవని జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కార్యక్రమం అమలు తీరు, వైద్య సిబ్బందికి అందిస్తున్న శిక్షణ, సాంకేతిక ఏర్పాట్లు, తదుపరి కార్యాచరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం సంజీవని కార్యక్రమానికి సంబంధించి వైద్యాధికారులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే ట్రయల్ రన్ సమయంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. వైద్యాధికారులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు కూడా నిపుణులైన వైద్యుల సలహాలు, నాణ్యమైన వైద్య సేవలు మరింత సులభంగా అందుతాయని తెలిపారు. ఏపీ ఎస్ఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నిర్మల్ కుమార్ ని అవసరమైనచోట్ల పిహెచ్సిలో, సిహెచ్ లో ఈ సంజీవిని కి అవసరమైన నిర్మాణాలు సంబంధించిన ఏర్పాట్లుకి నిర్మాణాలు జరపాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మరియు సంజీవని జిల్లా కమిటీ కన్వీనర్ డాక్టర్ టి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జిల్లాలోని మొత్తం 54 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన వైద్యాధికారులు, గుర్తించిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, బఫర్ సిబ్బందికి ప్రస్తుతం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. శిక్షణ అనంతరం డిసెంబర్ నెలలో ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు, జనవరి 1, 2027 నుంచి సంజీవని కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, జిల్లాలో కూడా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రవణ్ కుమార్, జీజీహెచ్ ఒంగోలు సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని. కిరణ్ కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ కె.వి. లక్ష్మీ కుమారి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్. సూరిబాబు, ఆంధ్రప్రదేశ్ సంజీవని కార్యక్రమం టాటా కన్సల్టెన్సీ శిక్షణ నిపుణులు ఆర్.సి. దర్శన్, జీజీహెచ్ నోడల్ అధికారి డాక్టర్ ఎస్. విజయభాస్కర్, ఏపీఎస్ఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. నిర్మల్ కుమార్, జిల్లా కంప్యూటర్ ప్రోగ్రాం అధికారి సి.హెచ్. ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ డీ.ఈ.ఎం.ఓ. కె.ఎ. రాజు తదితర జిల్లా అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కత్తి మీద సాములాంటి ఎన్నికల నిర్వహణ బాధ్యత..

సమన్వయంతో విజయవంతంగా నిర్వహించిన కమిషనర్ రమణబాబు!

నోటిఫికేషన్ నుంచి నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం వరకు ప్రత్యేక శ్రద్ధ..

ఫ్రెండ్లీ ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర.. ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే, చైర్మన్ నుంచి ప్రజల వరకు ప్రశంసలు!

గిద్దలూరు పెన్ పవర్ నవంబర్ 24



గిద్దలూరు మున్సిపాలిటీలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడం ఒక విశేషమైతే.. ఎన్నికల నోటిఫికేషన్ నుంచి నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం వరకు ప్రతి కార్యక్రమాన్ని సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడం మరో ప్రత్యేకతగా నిలిచింది. ఈ మొత్తం ప్రక్రియలో మున్సిపల్ కమిషనర్, సహాయ ఎన్నికల అధికారి ఈ.వి. రమణబాబు కీలక పాత్ర పోషించారు. ఎన్నికలు నిర్వహించడం అంటే అంత సులభమైన విషయం కాదు. అది నిజంగా కత్తి మీద సాము లాంటిదే! ఒకవైపు రాజకీయ పార్టీల పోటీ, మరోవైపు అభ్యర్థుల ఆశలు, నాయకులు, కార్యకర్తల హడావుడి, ప్రజల అవసరాలు.. వీటన్నింటినీ సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం అధికారులకు పెద్ద సవాలు. అలాంటి క్లిష్టమైన బాధ్యతను సహాయ ఎన్నికల అధికారిగా కమిషనర్ రమణబాబు సమన్వయంతో నిర్వహించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, పోలింగ్ ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలోనూ అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కృషి చేశారు. ఎన్నికల నిబంధనలను పాటిస్తూనే అందరితో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ ఫ్రెండ్లీ ఎన్నికల నిర్వహణకు ప్రాధాన్యత ఇచ్చారు.

ఎన్నికలు ముగిశాయి.. బాధ్యత ముగియలేదు!

ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం కూడా కమిషనర్ రమణబాబు తన బాధ్యతల్లో భాగంగా నూతన పాలకవర్గం కొలువుదీరే కీలక ఘట్టమైన చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకార సభ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. సభా ప్రాంగణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. వేదిక ఏర్పాట్లు, కూర్చునే సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ప్రతి అంశాన్ని పర్యవేక్షించారు. దీంతో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం సజావుగా, వైభవంగా సాగింది.

ఎన్నికల నిర్వహణలో కీలక సారథి.. కమిషనర్ రమణబాబు!

ఒకవైపు ఎన్నికల విధుల నిర్వహణ.. మరోవైపు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలను గుర్తించడం.. ఇంకోవైపు రాజకీయ నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకోవడం.. ఇలా అనేక బాధ్యతలను ఒకేసారి నిర్వర్తించాల్సిన పరిస్థితుల్లో సహాయ ఎన్నికల అధికారి హోదాలో రమణబాబు ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. ఎన్నికల ప్రతి దశలోనూ సమన్వయానికి ప్రాధాన్యతనిస్తూ, ఫ్రెండ్లీ విధానంలో ముందుకు సాగడం ఆయన పనితీరులో ప్రత్యేకంగా ప్రస్తావించదగిన అంశం.

ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే నుంచి ప్రజల వరకు అభినందనలు!

గిద్దలూరు మున్సిపల్ ఎన్నికల నిర్వహణతో పాటు నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార సభకు చేసిన ఏర్పాట్లపై ఉన్నతాధికారులు, గిద్దలూరు ఎమ్మెల్యే, నూతన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ సభ్యులు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు సైతం కమిషనర్ ఈ.వి. రమణబాబును ప్రశంసించారు. ఎన్నికల సమయంలో అందరితో స్నేహపూర్వకంగా వ్యవహరించడం, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయడం, నూతన పాలకవర్గం కొలువుదీరే కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో చూపిన చొరవను పలువురు అభినందించారు. ఈ మొత్తం ప్రక్రియ విజయవంతం కావడంలో స్వర్ణ, వార్డు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది కృషి కూడా ఎంతో ఉంది. కమిషనర్ మార్గదర్శకత్వంలో సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించారు. వీరందరికీ కూడా ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. బాధ్యత తీసుకోవడం ఒక ఎత్తు.. ఆ బాధ్యతను చివరి వరకు సమన్వయంతో పూర్తి చేయడం మరో ఎత్తు. ఎన్నికల నోటిఫికేషన్ నుంచి నూతన పాలకవర్గం కొలువుదీరే వరకు సాగిన గిద్దలూరు మున్సిపల్ ఎన్నికల ప్రస్థానంలో సహాయ ఎన్నికల అధికారి, కమిషనర్ ఈ.వి. రమణబాబు పాత్ర ప్రత్యేకంగా నిలిచింది. ఎన్నికల నిర్వహణలో చూపిన చొరవకు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి అభినందనలు అందుకోవడం విశేషం.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సమీక్ష

– వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్.. ఎస్పీ.. జాయింట్ కలెక్టర్

స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ నవంబర్ 24

స్థానిక సంస్థలు (కందుకూరు మున్సిపాలిటీ), గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు.. ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో కలిసి కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పాల్గొన్నారు. జిల్లాలో మూడు విడతలుగా చేపట్టనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఒంగోలు, కొండపి నియోజకవర్గాలలోని 8 మండలాలలో నిర్వహించనున్నారు. కందుకూరు మున్సిపాలిటీలు నిర్వహించనున్న మునిసిపల్ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ ఎన్నికలలో సుమారుగా 10 లక్షల 70902 మంది ఓటర్లు పాల్గొననున్నారు. జిల్లాలో పంచాయతీలు ఎన్నికలకు సంబంధించి సర్వం సిద్ధం చేసినట్టు జిల్లా కలెక్టర్ వివరించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు పోలింగ్ స్టేషన్ల వద్ద వద్ద పోలీసులను ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. తొలి విడత లో నిర్వహించనున్న 139 గ్రామపంచాయతీ గాను 62



గ్రామపంచాయతీలు ఏకగ్రీవం కాగా 77 గ్రామ పంచాయతీలలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ సంబంధిత పంచాయతీ అధికారి, కందుకూరు మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతంగా జరిగే విధంగా



చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక సమస్యలు ఏదైనా ఉన్నట్లయితే పై అధికారులు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ కందుకూరు మున్సిపల్ కమిషనర్ అనూష డిపిఓ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

ఎన్నికల కమిషనర్ తో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఎస్పీ



మార్కాపురం పెన్ పవర్ నవంబర్ 24

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిర్వహించిన ఉన్నతస్థాయి వీడియో కాన్ఫరెన్స్ లో మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషనర్ ఎన్నికల ముందస్తు ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. సమస్యాత్మక, సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని, శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

ఆనంద ఆశ్రమం దేదీప్యమానం



దొనకొండ నవంబర్ 24 పెన్ పవర్

మండల కేంద్రంలోని విరాట్ నగర్ లో గల శ్రీ ఆనంద ఆశ్రమం కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని మంగళవారం తెల్లవారుజాము నాలుగు గంటల నుండి భక్తులు కార్తీకదీపాలు వెలిగించారు ఆశ్రమంలో కొలువై ఉన్న గోవిందమాంబశ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారికి శ్రీ అన్నపూర్ణ సహిత శ్రీ విశ్వేశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు ప్రత్యేక అలంకరణ లు చేసి హర హర మహాదేవ శంభో శంకర ఓం నమశ్శివాయ అను పంచాక్షరి మహా మంత్రంతో ఆశ్రమం మారుమ్రోగింది చుట్టుపక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు దీక్ష దారులు పాల్గొన్నారు పచ్చిన భక్తులతొ ఆశ్రమ ప్రధాన అర్చకులు మణి బాబు శర్మ విశేష పూజ నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు రాత్రి జోలతోరణం ఆకాశదీపోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆశ్రమాధిపతులు శ్రీ భైరవానంద స్వామి తెలియజేశారు.

బాదినేని పల్లె సర్పంచిగా ఎర్రి శారద, ఉప సర్పంచ్ గా రమణయ్య ఏకగ్రీవంగా ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నిక

కొమరోలు పెన్ పవర్ నవంబర్ 24



కొమరోలు మండలం బాదినేని పల్లె సర్పంచిగా తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థిని ఎర్రి శారద, ఉప సర్పంచ్ గా పి రమణయ్య ఎన్నికయ్యారు. బాధినేనిపల్లి సర్పంచ్ పదవికి ప్రత్యర్థులు వేసిన నామినేషన్లను వారు ఉపసంహరించుకోవడంతో ఎర్రి శారద సర్పంచి పదవికి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా రిటర్నింగ్ అధికారి సిద్దేశ్వర శర్మ ప్రకటించారు. మంగళవారం కొమరోలు లోని స్వర్ణ గ్రామ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాదినేని పల్లె సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎర్రి శారదకు రిటర్నింగ్ అధికారి డిక్లరేషన్ అందించి అభినందించారు.అనంతరం నిర్వహించిన ఉపసర్పంచి ఎన్నికలు వార్డు మెంబర్ పి రమణయ్య ను తోటి వార్డు మెంబర్లు ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు మెంబర్ల కు రిటర్నింగ్ అధికారి డిక్లరేషన్లు అందించే అభినందించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డి, బాధినేనిపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల ఎల్లారెడ్డి,పలువురు తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బంది సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులను అభినందించారు.

విదేశీ ఉద్యోగాల పేరిట మోసం

– అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచన



ఒంగోలు టౌన్, పెన్ పవర్ నవంబర్ 24

మన రాష్ట్రంలోని కొందరు ఏజెంట్లు, సోషల్ మీడియా చానల్స్ అయిన ఇన్స్టాగ్రామ్, టెలిగ్రామ్ మొదలగు వాటి ద్వారా విదేశాలకు వివిధ పనులు ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రకటనలు ఇస్తున్నారని అలాంటి ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి రాజా బాబు సూచించారు. సదరు ఉద్యోగాల కొరకు వచ్చిన యువతను ఆ దేశాలకు వెళ్ళిన తరువాత వారిని బలవంతంగా సైన్యంలో చేర్చుతున్నారని తెలుస్తుందని పేర్కొన్నారు. ఈ మధ్య కాలములో ఉత్తరాంధ్ర నుండి కొంత మంది యువతను రష్యా తీసుకొని వెళ్ళి వారిని సైన్యంలో చేర్చినట్లు తెలుస్తుందని తెలిపారు. ప్రకాశం జిల్లా యువత సదరు సోషల్ మీడియా ద్వారా వెలువడే మోసపూరిత ప్రకటనల పట్ల అప్రమతముగా ఉండాలని , అటువంటి ప్రకటనలు చూసి మోసపోకుండా విదేశాలలో చదువు కొరకు లేదా ఉద్యోగం కొరకు ప్రయత్నించినప్పుడు సరైన అధికార ధృవ పత్రములు కలిగిన ఏజెంట్ లను సంప్రదించాలని సూచించారు. పాస్ పోర్ట్ లు వీసాలు పొందు సమయంలో తగు జాగ్రతలు వహించాలని, మీ వ్యక్తిగత వివరాలు ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, బ్యాంక్ ఖాతా వివరములు అన్నింటిని గోప్యముగా ఉంచుకొని సరియైన సంస్థను మాత్రమే సంప్రదించి తగు జాగ్రతలు తీసుకొనవలసినదిగా జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

ఈ-సంజీవని సేవల విస్తరణకు ప్రత్యేక శిక్షణ





ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ నవంబర్ 24

ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, స్పెషలిస్ట్ వైద్యుల సేవలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఈ-సంజీవని కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లాలో తొలి బ్యాచ్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఒంగోలు పట్టణంలోని ఈస్ట్ కేబీ ఎదురుగా ఉన్న బ్రిలియంట్స్ కంప్యూటర్స్‌లో రెండు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన 61 మంది వైద్యాధికారులు, 29 మంది కమ్యూనిటీ వైద్యాధికారులు మొత్తం 90 మందికి తేదీ 23, 24 రోజులు శిక్షణ నిర్వహించారు. సంజీవని ఆంధ్రప్రదేశ్ ప్రోగ్రాం యూనిట్‌కు చెందిన టాటా కన్సల్టెన్సీ ప్రత్యేక శిక్షణ నిపుణులు ఎం.సుధారాణి, వి.శ్రీనివాస్, ఆర్.సితర్షన్ తదితరులు వివిధ విజువల్స్, ఆన్‌లైన్ ప్రదర్శనలు, ప్రాక్టికల్ విధానాల ద్వారా వైద్య సిబ్బందికి ఈ-సంజీవని సేవల వినియోగంపై సమగ్ర శిక్షణ అందించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు సందర్శించి, శిక్షణ పొందుతున్న వైద్య సిబ్బందితో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధుల్లో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ఈ-సంజీవని సేవలను పటిష్టంగా అమలు చేస్తూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలతో పాటు వివిధ విభాగాలకు చెందిన స్పెషలిస్ట్ వైద్యుల ఆన్‌లైన్ కన్సల్టేషన్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఈ-సంజీవని ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రవణ్ పాల్గొన్నారు.

యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడాలి

అధికారులకు కలెక్టర్, ఎస్పీ ఆదేశం

మార్కాపురం, పెన్ పవర్, నవంబర్ 24:

మార్కాపురం జిల్లాను గంజాయి, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత, జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణ, నిర్మూలన లక్ష్యంగా జిల్లా స్థాయి ఎన్‌కార్డ్ సమావేశాన్ని కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో సంబంధిత జిల్లా అధికారులతో నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యాసంస్థలు, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు, యువతకు వివరించాలని సూచించారు.గంజాయి సాగు, అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి, వాటి వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను ఛేదించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి నెలా జిల్లా స్థాయి ఎన్‌కార్డ్ సమావేశం నిర్వహించి, గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన చర్యలను సమీక్షించి, తదుపరి కార్యాచరణపై



నిర్ణయాలు తీసుకోనున్నట్లు కలెక్టర్, ఎస్పీ తెలిపారు. యువత భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా మార్కాపురం జిల్లాను గంజాయి, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

– ఎమ్మెల్యే దామచర్ల



ఒంగోలు టౌన్, పెన్ పవర్ నవంబర్ 24

పంచాయతీ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఒంగోలు మండలం యరజర్ల గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి కాకుమాని రామకృష్ణ.. వార్డు సభ్యులను సమిష్టి కృషి తో పనిచేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే జనార్దన్ రావు పేర్కొన్నారు.

సినీ నటుడు గిరిబాబు చిత్రపటానికి ఎంపీ మాగుంట నివాళి

రావినూతలలోని స్వగృహంలో కుటుంబ సభ్యులకు పరామర్శ



అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) నవంబర్ 24

ప్రముఖ సీనియర్ సినీ నటుడు గిరిబాబు ఇటీవల స్వర్గస్థులైన నేపథ్యంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట. శ్రీనివాసులురెడ్డి మంగళవారం కొరిశపాడు మండలం, రావినూతల గ్రామంలోని ఆయన స్వగృహాన్ని సందర్శించారు. గిరిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ?అనంతరం గిరిబాబు కుమారుడు, ప్రముఖ సినీ నటుడు రఘుబాబుతో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా దివంగత గిరిబాబుతో తమకు ఉన్న దశాబ్దాల అనుబంధాన్ని, ఆయనతో గడిపిన మధుర జ్ఞాపకాలను ఎంపీ మాగుంట గుర్తుచేసుకున్నారు. సినీ రంగానికి గిరిబాబు అందించిన విశేష సేవలను కొనియాడుతూ, ఆయన మృతి తెలుగు చిత్రసీమకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొమరోలు సర్పంచిగా షేక్ ఖాజావలి, ఉపసర్పంచిగా వీరం రెడ్డి సుమతి ఏకగ్రీవంగా ఎన్నిక

కొమరోలు పంచాయతీలోని 16 వార్డులకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక

కొమరోలు గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని అభినందించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మొత్తములో సంజీవరెడ్డి తదితర నేతలు

సర్పంచు ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు అందించి అభినందించిన రిటర్నింగ్ అధికారి సిద్దేశ్వర శర్మ



కొమరోలు పెన్ పవర్ నవంబర్ 24

కొమరోలు గ్రామపంచాయతీ సర్పంచ్ గా షేక్ ఖాజావలి, ఉప సర్పంచ్ గా వీరం రెడ్డి సుమతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొమరోలు సర్పంచ్ పదవికి నామినేషన్లు వేసిన ప్రతి పక్ష వర్గానికి చెందిన సభ్యులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో కూటమి పార్టీలు బలపరిచిన షేక్ ఖాజావలి కొమరోలు గ్రామపంచాయతీ షేక్ ఖాజావలి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కొమరోలు లోని స్వర్ణ గ్రామ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సిద్దేశ్వర శర్మ సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఖాజావలికి డిక్లరేషన్ ఫారం అందించి అభినందించారు అనంతరం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించగా సభ్యులు 9వ వార్డు మెంబర్ వీరం రెడ్డి సుమతిని ఉపసర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ మేరకు 16 మంది వార్డు సభ్యులందరికీ రిటర్నింగ్ అధికారి డిక్లరేషన్ ఫారాలు అందజేశారు.ఆ కార్యక్రమంలో పాల్గొన్న కొమరోలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు సంజీవరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు వీరం రెడ్డి శంకర్ రెడ్డి,వీరం రెడ్డి కృష్ణమోహన్ రెడ్డి, చలిచీముల శ్రీనివాస చౌదరి,, కొమరోలు మాజీ వార్డ్ మెంబర్ షేక్ సుభాని,, మండల పరిషత్ మాజీ మెంబర్ షేక్ నబి, తదితర నేతలు, కొమరోలు గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారిని వై గీత, స్వర్ణ గ్రామ కార్యదర్శి ఓఆర్ జనార్దన్ రెడ్డి,స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బంది సర్పంచి ఖాజావలి, ఉపసర్పంచి సుమతిని, 16 మంది వార్డు సభ్యులను అభినందించారు.



భయం లేకుండా ఓటేయండి పోలీసులే అండగా ఉంటారు

ఎస్పీ పంకజ్ కుమార్ మీనా



మార్కాపురం, పెన్ పవర్, నవంబర్ 24

నవంబర్ 26న జరిగే మొదటి విడత పంచాయతీ ఎన్నికలు, పొదిలి నగర పంచాయతీ ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా తెలిపారు.కనిగిరి నియోజకవర్గ పరిధిలోని 6 మండలాల్లో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, స్పెషల్ ఫోర్స్, రూట్ మొబైల్స్ రంగంలోకి దింపామన్నారు. పోలింగ్ కేంద్రాలను హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్, సాధారణ కేంద్రాలుగా వర్గీకరించి, సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్, డ్రోన్‌లతో నిరంతర నిఘా ఉంచుతున్నామన్నారు. ప్రచార గడువు ముగిసింది, ఇక ఎలాంటి ప్రచారం చేయరాదని స్పష్టం చేశారు. ఎన్నికల నియమావళి, పోలీస్ యాక్ట్-30, బీఎన్ఎస్ఎస్-163 ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, గుంపులుగా గుమిగూడటం, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు.ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని, ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే జిల్లా పోలీస్ ఎన్నికల కంట్రోల్ రూమ్ 9121104783 కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

అన్నా.. సర్పంచ్‌గా అవకాశం ఇవ్వండి

మీ ఓటు ద్వారా ప్రతి ఒక్కరు ఆదరించండి

సర్పంచ్ అభ్యర్థి షేక్ నూరి మాజీ సర్పంచ్ షేక్ మహబూబ్ పీరా

గ్రామస్తులతో ఉన్న అనుబంధం



పెన్ పవర్, కంభం నవంబర్ 24

అన్నా.. మరోసారి అవకాశం కల్పించండి సర్పంచ్ అభ్యర్థినిగా షేక్ నూరి మాజీ సర్పంచ్ షేక్. మహబూబ్ పీరా స్పష్టం చేశారు. మన గుర్తు కత్తెర గుర్తు .కంభం మండలం హజరత్ గూడెం సర్పంచ్ ఎన్నికలలో పోటీ చేస్తున్నాం. గతంలో చేసిన అభివృద్ధి పనులు మరియు గ్రామం తో ఉన్న అనుబంధం తనకు ఎంతో సన్నిహిత సంబంధం ఉందన్నారు. గతంలో నేను సర్పంచ్ గా పనిచేసిన కాలంలో రూ1.5 కోట్లకు పైగా మా గ్రామంలో అభివృద్ధి పనులు చేశానన్నారు. అంతేకాక గతంలో పనిచేసిన కాలంలో తాగునీటికి గ్రామంలో రోడ్లు డ్రైనేజీ వీధిలైట్లకు మంచి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. రాజకీయ సమీకరణల నేపథ్యంలో మరోసారి సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నాం . కాగా ఆ గ్రామంలో ముస్లిం సంఖ్యాబలం ఎక్కువగా ఉన్నది. యూత్ నుండి వృద్ధుల వరకు అభిమానులు మద్దతు లభిస్తుంది. సర్పంచ్ ఎన్నికలలో బరిలో నిలిచాము ఓటర్లు ఆదరించండి . ఎన్నడూ లేని విధంగా రాబోయే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలని పట్టుదలతో ఉన్నారు.కేవలం పోటీ చేస్తేనే సరిపోదు ప్రజల్లో మంచితనం పలుకుబడి కూడా అవసరమని అన్నింటికంటే ముఖ్యంగా ప్రజాసేవ చేయగలుగుతాం అన్నారు. ఈ నమ్మకాన్ని ప్రజల్లో కలిగించిన వారికి కచ్చితంగా ప్రజలు వారికి పట్టం కడతారని అభిప్రాయం వ్యక్తమవుతున్నది.తమ గ్రామంలో సర్వశక్తుల మా వంతు ప్రయత్నాలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి

సర్పంచ్ కు 158,

వార్డుకు 372 నామినేషన్లు చెల్లుబాటు

14 నామినేషన్లు తిరస్కరణ

వలేటివారిపాలెం, పెన్ పవర్ నవంబర్ 24:

వలేటివారిపాలెం మండలంలో ఫేజ్-3 పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన మంగళవారం పూర్తయింది. మండలంలోని 21 గ్రామ పంచాయతీల సర్పంచ్ పదవులకు, 194 వార్డులకు నామినేషన్లు దాఖలు కాగా, అధికారులు వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. సర్పంచ్ పదవికి దాఖలైన 165 నామినేషన్లలో 158చెల్లుబాటు అయ్యాయి. వార్డు సభ్యుల పదవికి దాఖలైన 379 నామినేషన్లలో 372 చెల్లుబాటు అయ్యాయి. సర్పంచ్ పదవికి 7 వార్డు సభ్యుల పదవికి 7నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. పత్రాల్లో లోపాలు, నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో వాటిని తిరస్కరించినట్లు అధికారులు తెలిపారు. పరిశీలన పూర్తికావడంతో చెల్లుబాటు అయిన అభ్యర్థులే ఇక ఎన్నికల బరిలో నిలవనున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత తుది అభ్యర్థుల జాబితా ఖరారు కానుంది.

చింతలపల్లి సర్పంచిగా సారే ఎల్లాలు నాయుడు, ఉపసర్పంచిగా పిట్టల అల్లూరయ్య ఏకగ్రీవంగా ఎన్నిక



కొమరోలు పెన్ పవర్ నవంబర్ 24

కొమరోలు మండలం చింతలపల్లె గ్రామపంచాయతీ సర్పంచిగా జనసేన పార్టీ బలపరిచిన అభ్యర్థి సారే ఎల్లాల నాయుడు, ఉపసర్పంచిగా జనసేన పార్టీ బలపరిచిన పిట్టల అల్లూరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చింతలపల్లి గ్రామ సర్పంచ్ పదవికి నామినేషన్ వేసిన వైసిపి బలపరిచిన అభ్యర్థులందరూ తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో జనసేన పార్టీ బలపరిచిన సారే ఎల్లాలు నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా మండల రిటర్నింగ్ అధికారి, స్థానిక ఎంపీడీవో పి రమేష్ బాబు, నామినేషన్ల స్వీకరణ కేంద్ర రిటర్నింగ్ అధికారి సిద్దేశ్వర శర్మ ప్రకటించారు. ఆ సందర్భంగా మంగళవారం కొమరోలు లోని స్వర్ణ గ్రామ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చింతలపల్లి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సారే ఎల్లాలు నాయుడుకు రిటర్నింగ్ అధికారి సిద్దేశ్వర శర్మ డిక్లరేషన్ అందించి అభినందించారు. అనంతరం ఉప సర్పంచ్ పదవికి నిర్వహించిన ఎన్నికలలో చింతలపల్లె మూడో వార్డు మెంబర్ పిట్టల అల్లూరయ్యను సభ్యులు ఉపసర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వార్డు సభ్యులందరికీ ఆర్ఓ డిక్లరేషన్ ఫారాల అందించి అభినందించారు.ఆ కార్యక్రమంలో కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముత్తుముల సంజీవరెడ్డి, పలువురు కూటమి పార్టీల నాయకులు,మలికే గ్రామానికి చెందిన మాజీ సైనికులు సారే ఓబులేసు, చింతలపల్లి గ్రామ పంచాయతీకి చెందిన పలువురు కూటమి పార్టీల నేతలు కార్యకర్తలు, కొమరోలు గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారిని వై గీత, స్వర్ణ గ్రామ కార్యదర్శి జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొని సర్పంచ్ ఎల్లాలు నాయుడు ఉప సర్పంచ్ పిట్టల అల్లూరయ్య, వార్డు మెంబర్లను అభినందించారు. చింతలపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి, ముత్తుముల సంజీవరెడ్డి, మండల అధ్యక్షురాలు బోనేని రమణమ్మ తదితర నేతలు, అధికారుల సహకారంతో కృషి చేస్తామని సర్పంచి ఎల్లాల నాయుడు ఉపసర్పంచ్ పిట్టల అల్లూరయ్య తెలిపారు.



ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు - గ్రామ పంచాయతీ, కందుకూరు మున్సిపల్

ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు

ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ నవంబర్ 24



ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎన్నికల అనంతరం కూడా ఇరు వర్గాలు సంయమనం పాటిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడరాదని ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు సూచించారు. ప్రకాశం జిల్లాలో జరగనున్న గ్రామ పంచాయతీ, కందుకూరు మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు మంగళవారం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, తెలిపారు. ఈ నెల 26న జరగనున్న తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, సింగరాయకొండ,కొండేపి,జరుగుమల్లి, పొన్నలూరు మరియు మర్రిపూడి 8 మండలాల పరిధిలో మొత్తం 139 గ్రామ పంచాయతీలకు గాను 62 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 77 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. అదేవిధంగా, మొత్తం 1,396 వార్డులకు గాను 782 వార్డులు ఏకగ్రీవం కాగా, 610 వార్డులకు ఎన్నికలు, మరో 4 వార్డులకు ఎన్నికలు జరగడం లేదన్నారు. 246 పోలింగ్ ప్రాంతాల్లో (హైపర్ సెన్సిటివ్ -35, సెన్సిటివ్ -73,నార్మల్ - 138) 840 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, 1,89,922 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికల బందోబస్తు నిమిత్తం ఏ.ఎస్పీ -2, డి.ఎస్పీ- 4, సిఐ- 17, ఎస్సై- 34 సిబ్బంది మొత్తం 1,168 మందిని, 37 రూట్లలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా 187 చెడు నడతగల వ్యక్తుల(రౌడీషీటర్ల)ను, 781 మంది ట్రబుల్ మాంగర్స్‌ను బైండోవర్ చేయడంతో పాటు, శాంతి భద్రలకు విఘాతం కలిగించే/గొడవలు/అల్లర్లు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి 10 కేసులు, ఎక్సైజ్‌కు సంబంధించి 23 కేసులు, 6 కేసులలో నగదు 5,42,200/- స్వాధీనం, శాంతిభద్రతలకు సంబంధించి 9 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కందుకూరు మున్సిపాలిటీలోని 40 వార్డులకు సంబంధించి 44 పోలింగ్ లొకేషన్లలో(హైపర్ సెన్సిటివ్ -9, సెన్సిటివ్ -13,నార్మల్ - 22) 65 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, మొత్తం 47,471 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల బందోబస్తు నిమిత్తం డిఎస్పీ-1,సిఐ/ఆర్ఐ -3, ఎస్సై -16 పోలీస్ సిబ్బంది మొత్తం 157 మందిని నియమించినట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా 34 మంది చెడు నడతగల వ్యక్తులు (రౌడీషీటర్ల)ను, 45 మంది శాంతి భద్రలకు విఘాతం కలిగించే/గొడవలు/అల్లర్లు పాల్పడే వ్యక్తులను బైండోవర్ చేయడం జరిగిందన్నారు. అత్యవసర పరిస్థితుల కోసం స్ట్రైకింగ్, రిజర్వ్ ఫోర్సులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవాల పేరుతో ర్యాలీలు, బాణసంచా కాల్చడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు పెట్టడం వంటివి చేయరాదని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు 163 బీఎన్ఎస్ఎస్,(144 సెక్షన్) పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉంటాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత, ప్రశాంత వాతావరణం కోసం జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు.

పుల్లారెడ్డిపల్లి సర్పంచిగా దప్పిలి సావిత్రి ఉప సర్పంచ్‌గా బొమ్మినేని నాగమ్మ





కొమరోలు పెన్ పవర్ నవంబర్ 24

కొమరోలు మండలం పుల్లారెడ్డి పల్లె సర్పంచిగా తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి దప్పిలి సావిత్రి, ఉప సర్పంచ్ గా బొమ్మినేని నాగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పుల్లారెడ్డి పల్లె సర్పంచ్ పదవికి బిజెపి బలపరిచిన అభ్యర్థిగా నామినేషన్ వేసిన అభ్యర్థి తమ నామినేషన్ ఉపసమరించుకోవడంతో పుల్లారెడ్డి పల్లె సర్పంచ్ పదవికి తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థిని దప్పిలి సావిత్రి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. మంగళవారం కొమరోలు లోని స్వర్ణ గ్రామ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి సిద్దేశ్వర శర్మ దప్పిలి సావిత్రి కి డిక్లరేషన్ అందించి అభినందించారు. అనంతరం నిర్వహించిన ఉపసర్పంచ్ ఎన్నికలో బొమ్మినేని నాగమ్మ ను వార్డు మెంబర్లు ఉప సర్పంచ్ గా ఎన్నుకున్నారు. ఆర్ ఓ సిద్దేశ్వర శర్మ వార్డు సభ్యులందరికీ డిక్లరేషన్ అందించే అభినందించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు సహకార సంఘం చైర్పర్సన్ ముత్తుముల సంజీవరెడ్డి, పలువు తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు, పుల్లారెడ్డిపల్లి గ్రామపంచాయతీ తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు, కొమరోలు గ్రామపంచాయతీ అభివృద్ధి గారిని వై గీత స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బంది అభినందించారు. పుల్లారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి,కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ముత్తుముల సంజీవరెడ్డి తదితర నేతలు, అధికారుల సహకారంతో కృషి చేస్తానని సర్పంచ్ దప్పిలి సావిత్రి తెలిపారు.

అర్ధవీడు మండలంలో మూడు పంచాయతీలు ఏకగ్రీవాలు

అర్ధవీడు, పెన్ పవర్, నవంబర్ 24

అర్ధవీడు మండలంలో మూడు పంచాయతీలు ఏకాగ్రీవలయ్యాయి. మొత్తం పంచాయతీలు 15 గాక అందులో మూడు పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. నాగులవరం పంచాయతీకి గుడిసె గోపాల్ రెడ్డి, రంగాపురం పంచాయతీకి గంగుల రామలింగమ్మ, అయ్యవారి పల్లె పంచాయతీకి శెట్టి గాబ్రియేలు ఏకగ్రీవమయ్యారు.

డిసెంబర్ 1.. 2.. 3 తేదీలలో ఛలో ఢిల్లీ

- హక్కుల సాధనే లక్ష్యం - సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు



ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ నవంబర్ 24

లేబర్ కోడలు రద్దు కోసం, కనీస వేతనం, కనీస ఆదాయం ,కనీస పెన్షన్ పెంపు కోసం, కార్మికులుగా గుర్తింపు ,ఉద్యోగుల పర్మినెంట్ కోసం ఢిల్లీ ఆక్రమణకు కదిలి రావాలని డిసెంబర్ 1 2 3 తేదీల్లో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఒంగోలు నగర సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు పేర్కొన్నారు. మంగళవారం సిఐటియు ఒంగోలు నగర సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో, స్థానికంగా యూనియన్ బ్యాంక్, కలెక్టరేట్ ,ట్రక్ రోడ్డు , అద్దంకి బస్ స్టాండ్, ఒంగోలు ఆర్టీసీ డిపో క్యారేజ్ వరకు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి సిఐటియు ఒంగోలు నగర కన్వీనర్ టి.మహేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ సమస్త కార్మికుల కోరికల పరిష్కారం కోసం డిసెంబర్ 1 నుండి 3తేదీ వరకు ఢిల్లీ ఆక్రమణకు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఎక్కడ చూసిన అదానీ ,అంబానీ బిర్లా, మిట్టల్ కనపడుతున్నారని, కార్పొరేట్ సంస్థల యాజమాన్యానికి కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఊడిగం చేస్తూ ఉద్యోగుల కార్మికుల సమస్యలను గాలికి వదిలేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సి హెచ్ మజుందార్,మెడికల్ రిప్స్ యూనియన్ సి హెచ్ చిరంజీవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు పారా శ్రీనివాసరావు,జి.రమేష్ బాబు ,జీ విరాగయ్య, మెడికల్ అండ్ హెల్త్ యూనియన్ రాష్ట్ర నాయకులు తాళ్లూరు వెంకటేశ్వర్లు, పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సి హెచ్ రాంబాబు, జి శేషయ్య, సిఐటియు ఒంగోలు నగర నాయకులు బి వి రావు, దామా శ్రీనివాసులు, ఎస్.డి హుస్సేన్ ,టి విజయ, జె కృష్ణమోహన్, జి నరసింహ ఎం లక్ష్మీనారాయణ, బి భారతి, సంతోషం, దివ్య తదితరులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



కొనకనమిట్ల పెన్ పవర్ నవంబర్ 24

కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఎదురాళ్లపాడు, కొనకనమిట్ల,గొట్లగట్టు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.పౌర్ణమి వేళ పరమశివుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు.తెల్లవారుజాము నుంచే ఆలయాల వద్ద భక్తుల రాకపోకలు కొనసాగడంతో పండుగ వాతావరణం నెలకొంది.కార్తీక మాసంలో శివారాధనకు విశేష ప్రాధాన్యత ఉండటంతో కార్తీక పౌర్ణమి రోజున భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.ఆయా ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు,అర్చనలు జరిపి భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు.మహిళలు,యువత,వృద్ధులు కుటుంబ సమేతంగా ఆలయాలకు చేరుకుని దీపారాధనలు నిర్వహించారు.దీపాల వెలుగులు,భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణాలు భక్తిమయంగా మారాయి.కార్తీక పౌర్ణమి రోజున దీపారాధన చేయడం,శివుడిని భక్తితో ఆరాధించడం విశేష పుణ్యప్రదమని భక్తులు విశ్వసిస్తారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.రోజంతా ఆలయాల వద్ద భక్తుల సందడి కనిపించడంతో ఆయా గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తి భావంతో సాగాయి.పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని శివదర్శనం, ప్రత్యేక పూజలతో భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

టిడిపి అభ్యర్థి మల్లికార్జున గెలుపు లాంచన మేన?

-సర్పంచ్ పోటీకి 13 నామినేషన్ ఖరారు

-తెలుగుదేశం పార్టీ తరపున ఐదుగురు అభ్యర్థులు నామినేషన్

-పది పదకొండు రెండు వార్డులు ఏకగ్రీవం

ఉలవపాడు పెన్ పవర్, నవంబర్ 24

మండలం చాకిచెర్ల పంచాయతీలో సర్పంచి అభ్యర్థి పోటీకి 13 నామినేషన్లు ఖరారు కాగా అందులో తెలుగుదేశం పార్టీ తరపున ఐదుగురు అభ్యర్థుల నామినేషన్ వేశారు వైసీపీ పార్టీ తరపున నలుగురు అభ్యర్థులు నామినేషన్ వేశారు మిగిలినవి స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేశారు, పంచాయతీలో మొత్తం 12 వార్డులు ఉండగా రెండు వార్డులు ఏకగ్రీవమైనవి వీటిలో 11వ వార్డు ఎస్టీ రిజర్వుడ్ కావడంతో వైసీపీ పార్టీ వారు తమ అభ్యర్థిని పోటీలో ఉంచలేకపోయారు అయితే మల్లికార్జున కు ఎస్టి సంఘాలలో గట్టిపట్టు ఉండడంతో బలమైన అభ్యర్థిని పోటీలో ఉంచగలిగాడు కాగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలుగుదేశం పార్టీ తరపున సరియైన అభ్యర్థిని బరిలోకి దింపితే ఉలవపాడు మండలంలో చాకిచెర్ల పంచాయతీ టిడిపి ఖాతాలో చేరడం ఖాయమని ప్రజలు విశ్లేషించుకుంటున్నారు.

గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన కొమరోలు నూతన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు

ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఆశీస్సులతో కొమరోలు నూతన సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైన షేక్ ఖాజావలి ఉపసర్పంచ్ వీరం రెడ్డి సుమతి 16 మంది వార్డు సభ్యులు.

కొమరోలు పెన్ పవర్ నవంబర్ 24

కొమరోలు గ్రామపంచాయతీకి నూతన సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైన షేక్ ఖాజావలి, ఉప సర్పంచ్ గా ఎన్నికైన వీరం రెడ్డి సుమతి,,16 మంది వార్డు మెంబర్లు మంగళవారం ప్రత్యేకంగా సమావేశం గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కి,కొమరోలు సహకార సంఘం అధ్యక్షులు ముత్తుముల సంజీవరెడ్డికి, మధుసూదన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సహకారం, ఆశీస్సులతో కొమరోలు గ్రామపంచాయతీ సర్పంచ్ గా షేక్ ఖాజావలి, ఉప సర్పంచ్ గా వీరం రెడ్డి సుమతి తో పాటు 1వ వార్డు మెంబర్గా కొమరోలు శ్రీనివాసులు, 2వ వార్డ్ మెంబర్గా షేక్ రసూల్ బి, 3వ వార్డు మెంబర్గా షేక్ కరీముల్లా, 4వ వార్డ్ మెంబర్గా షేక్ జరీనా బేగం, 5వ వార్డ్ మెంబర్గా బుర్ర పెద్ద సుబ్బయ్య, 6వ వార్డు మెంబర్గా షేక్ అఫ్రీన్ బేగం, 7వ వార్డు మెంబర్గా షేక్ రహీమున్నీసా, 8వ వార్డ్ మెంబర్గా మందపల్లి సుబ్బమ్మ,9వ వార్డ్ మెంబర్గా వీరం రెడ్డి సుమతి (ఉప సర్పంచ్,) 10వ వార్డ్ మెంబర్గా జూదం శ్రీనివాసులు, 11వ వార్డు మెంబర్గా ఎస్కే నూర్జహాన్, 12వ వార్డు మెంబర్గా సూరా అనసూయ, 13వ వార్డు మెంబర్గా సత్వేలి అనిత, 14వ వార్డు మెంబర్గా గోడి పద్మావతి 15వ వార్డు మెంబర్గా సింగరయ్య ,16వ వార్డు మెంబర్గా ఎస్కే మౌలాలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం సాయంత్రం కొమరోలు లోని స్వర్ణ గ్రామ కార్యాలయంలో ఎన్నికల ట్రైనింగ్ అధికారి సిద్దేశ్వర శర్మతో డిప్లరేషన్లు పొందిన అనంతరం నూతన సర్పంచ్,ఉప సర్పంచ్,,16 మంది వార్డు సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి నివాస గృహ ప్రాంగణంలో ప్రత్యేకంగా సమావేశమై గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కి కొమరోలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముత్తుముల సంజీవరెడ్డికి, ముత్తుముల మధుసూదన్ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆ కార్యక్రమంలో ముత్తుముల సంజీవరెడ్డి ముత్తుముల మధుసూదన్ రెడ్డిలను నూతన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు ఘనంగా సన్మానించారు. కొమరోలు గ్రామపంచాయతీకి ఏకగ్రీవంగాఎన్నికైన వారిలో సర్పంచ్ తో పాటు ఆరు మంది వార్డు మెంబర్లు ముస్లింలే కావటం శుభ పరిణామం అని, అభినందనీయమని, అంతేకాక 16 మంది వార్డు మెంబర్లలో ఎనిమిది మంది మహిళా సభ్యులు ఎన్నిక కావడం మరొక శుభ పరిణామమని, ముత్తుముల సంజీవరెడ్డి ముత్తుముల మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు.





రాజుపాలెం సర్పంచిగా గోడి లక్ష్మమ్మ ఉపసర్పంచిగా తోట శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నిక

సర్పంచ్ ఉప సర్పంచ్లకు డిక్లరేషన్ అందించి అభినందించిన రిటర్నింగ్ అధికారి సుధాకర్



కొమరోలు పెన్ పవర్ నవంబరు 24

కొమరోలు మండలం రాజుపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ గా తెలుగుదేశం పార్టీ బలపరిచిన గోడి లక్ష్మమ్మ, ఉపసర్పంచిగా జి వెంకటాపురం గ్రామానికి చెందిన తోట శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజుపాలెం సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేసిన ప్రత్యర్థి పార్టీలకు చెందిన సభ్యులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి మాతృమూర్తి, మాజీ ఎంపిటిసి సభ్యురాలు, తెలుగుదేశం పార్టీ బలపరిచిన గోడి లక్ష్మమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా రిటర్నింగ్ అధికారి సుధాకర్ ప్రకటించారు. మంగళవారం రాజుపాలెం స్వర్ణ గ్రామ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజుపాలెం సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గోడి లక్ష్మమ్మ కు రిటర్నింగ్ అధికారి సుధాకర్ డిక్లరేషన్ అందించి అభినందించారు. అనంతరం నిర్వహించిన ఉపసర్పంచ్ ఎన్నికలలో జీ వెంకటాపురం గ్రామానికి చెందిన తోట శేఖర్ ను వార్డు సభ్యులు రాజుపాలెం ఉప సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వార్డు సభ్యులకు కు రిటర్నింగ్ అధికారి డిక్లరేషన్ అందించి అభినందించారు ఆ కార్యక్రమంలో గిద్దలూరు మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, రాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు షేక్ మహబూబ్ బి,తెలుగుదేశం పార్టీ నేతలు షేక్ దాదాభాష పఠాన్ మహబూబ్ ఖాన్, రామస్వామి తదితర నేతలు కార్యకర్తలు, స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బంది పాల్గొని సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులను అభినందించారు.



ముక్తాపురం సర్పంచ్ గా రావిపాటి తులసమ్మ ఉపసర్పంచిగా రావిపాటి సరస్వతి ఏక గ్రీవంగా ఎన్నిక





కొమరోలు పెన్ పవర్ నవంబర్ 24.

కొమరోలు మండలం ముక్తాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ గా తెలుగుదేశం పార్టీ బలపరిచిన రావిపాటి తులసమ్మ, ఉప సర్పంచ్ గా రావిపాటి సరస్వతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముక్తాపురం గ్రామ సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేసిన ప్రత్యర్థి పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ నామినేషన్లను మంగళవారం ఉపసంహరించుకోవడంతో ముక్తాపురం గ్రామ సర్పంచ్ పదవికి రావిపాటి తులసమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధాకర్ ప్రకటించారు. మంగళవారం సాయంత్రం రాజుపాలెం లోని స్వర్ణ గ్రామ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముక్తాపురం గ్రామపంచాయతీకి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రావిపాటి తులసమ్మకు డిక్లరేషన్ అందించి సుధాకర్ అభినందించారు. అనంతరం ఉపసర్పంచ్ పదవికి ఎన్నిక నిర్వహించగా వార్డు సభ్యులు రావిపాటి సరస్వతిని,ఉపసర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వార్డు సభ్యులకు ఆర్ ఓ సుధాకర్ డిప్లరేషన్లు అందించి. అభినందించారు.ఆ కార్యక్రమంలో రాజుపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు గిద్దలూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, రాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు షేక్ మహబూబ్ బి, తెలుగుదేశం పార్టీ నేతలు దాదాభాష తోపాటు ముక్తాపురం గ్రామపంచాయతీ కి చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు రాజుపాలెం స్వర్ణ గ్రామ సిబ్బంది సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులను అభినందించారు.

శ్రీగిరిలో నేత్రపర్వంగా అష్టోత్తర శత సహస్ర కలశాభిషేకం

- పులకించిన భక్తజనం - శోభాయమానంగా కార్తీక దీపోత్సవం



ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ నవంబర్ 24

కార్తీక మాస ప్రత్యేక కార్యక్రమాలలో భాగంగా కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళ వారం ఉదయం ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి అష్టోత్తర శత సహస్ర కలశాభిషేకం కార్యక్రమాన్ని ప్రముఖ వైఖానస ఆగమ వేద పండితులు పరాంకుశం నీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నేత్ర పర్వంగా నిర్వహించారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి నిర్వహించిన అష్టోత్తర శత సహస్ర కలశాభిషేకాన్ని ప్రత్యక్షంగా తిలకించిన భక్తులు పులకితగాత్రులయ్యారు. భక్తి పారవశ్యంతో గోవింద నామ స్మరణ చేశారు. సాయంత్రం శ్రీగిరి ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు. కార్తీక దీప కాంతులు పరమాత్ముని చిరు నగవు రేఖల వెన్నెల కాంతులను తలపించాయి. శ్రీవారి శంఖు చక్రాలు తోపాటు తిరునామాన్ని భక్తులు దీప ప్రమిదలతో ఏర్పరచారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీ కుమారి, ఆలూరు జై శంకర్ , ఆలూరు కుమార ఆత్రేయ, ఆలూరు ఫణి కుమార్, ఆలయ అర్చకులు వేద పండితులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు. శ్రీ గిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అంద చేశారు.



అమరలింగేశ్వర స్వామిని దర్శించుకున్న దివి రవీంద్రనాథ్



కందుకూరు పెన్ పవర్, నవంబర్ 24:

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉలవపాడు మండలం మన్నేటికోట గ్రామంలో కొలువై ఉన్న శ్రీ అమరలింగేశ్వర స్వామివారిని తెలుగుదేశం పార్టీ నాయకులు దివి రవీంద్రనాథ్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దివి రవీంద్రనాథ్‌కు ఘన స్వాగతం పలికి, శాలువాతో సత్కరించి పూలమాల వేశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు.ఈ కార్యక్రమంలో మన్నేటికోట గ్రామ మాజీ సర్పంచ్, అమరలింగేశ్వర స్వామి దేవస్థానం కమిటీ చైర్మన్ వీరగంధం సత్యనారాయణ, కాకర్ల మల్లికార్జునరావు, తలపనేని నరసింగరావు, దివి శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బొత్స వర్సెస్ చిన్న శ్రీను.. చీపురుపల్లిలో డైరెక్ట్ ఫైట్





చీపురుపల్లి రాజకీయాల్లో బొత్స సత్యనారాయణ, చిన్నశ్రీను మధ్య పోటీ ఆసక్తికరంగా మారింది. గత పరిషత్ ఎన్నికలకు దూరంగా ఉన్న చిన్నశ్రీను ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. చీపురుపల్లి, కొండపాలెం మేజర్ పంచాయతీలను రెండు వర్గాలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో స్థానిక పోరు వేడెక్కింది.

ఉత్తరాంధ్రలో అత్యంత కీలక నియోజకవర్గమైన చీపురుపల్లిలో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, టీడీపీ కీలక నేత, జడ్పీ మాజీ చైర్మన్ చిన్న శ్రీను మధ్య రాజకీయ పోరు ఉత్కంఠ రేకెత్తిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఇద్దరు ముఖాముఖి పోటీ చేస్తారో లేదో కానీ ప్రస్తుతం ఒకరిపై ఒకరు పైచేయి సాధించేలా వ్యూహరచన చేస్తున్నారు. జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల సమయంలో బొత్స సొంత నియోజకవర్గం చీపురుపల్లికి దూరంగా ఉన్న చిన్నశ్రీను ఇప్పుడు జరుగుతున్న పంచాయతీ ఎన్నికలను సవాల్ గా తీసుకోవడమే ఆసక్తి రేకెత్తిస్తోందని అంటున్నారు.

దాదాపు రెండున్నర దశాబ్దాలుగా చీపురుపల్లి కేంద్రంగా బొత్స, చిన్న శ్రీను రాజకీయాలు చేస్తున్నారు. బొత్స అడుగు జాడల్లో ఇన్నాళ్లు నడిచిన చిన్నశ్రీను ఇప్పుడు సొంత బలం నిరూపించుకునే పనిలో పడ్డారు. అయితే ప్రస్తుతం చీపురుపల్లిలో టీడీపీ సీనియర్ నేత కళావెంకటరావు ఎమ్మెల్యేగా ఉండటంతో అక్కడి రాజకీయాలకు చిన్నశ్రీను దూరంగా ఉంటున్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన తాను చీపురుపల్లి రాజకీయాల్లో జోక్యం చేసుకుంటే విభేదాలు తలెత్తే అవకాశం ఉందన్న ఆలోచనతో అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తూ వచ్చారు. దీని ఫలితంగా జడ్పీటీసీ ఎన్నికల్లో బొత్స పైచేయి సాధించారని విశ్లేషిస్తున్నారు. నియోజకవర్గంలో నాలుగు జడ్పీటీసీలకు రెండు వైసీపీ గెలుచుకోగా, ఒక మండల పరిషత్ నూ కైవసం చేసుకుంది. అదే సమయంలో ఒక మండల పరిషత్ లో టీడీపీతో సమానంగా సీట్లు సాధించింది.సంఖ్యాపరంగా చూస్తే టీడీపీదే మెజార్టీ అయినప్పటికీ బొత్స బలపడ్డారనేది కాదనలేని నిజమని విశ్లేషిస్తున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు వైఫల్యం కూడా ఉందనే టాక్ నడుస్తోంది. ఎమ్మెల్యే రాజకీయ చతురతతో నడుచుకుని ఉంటే వైసీపీ ఒక్కచోట గెలిచేది కాదని, బొత్స వ్యూహాలు తెలిసిన చిన్న శ్రీనును దూరంగా ఉంచడంతో మూల్యం చెల్లించుకున్నారని సొంత పార్టీ కార్యకర్తలే అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల విషయంలో చిన్న శ్రీను జోక్యం చేసుకోడం హాట్ టాపిక్ అవుతోంది.పరిషత్ ఎన్నికల సమయంలో చీపురుపల్లి వైపు చూడని చిన్నశ్రీను పంచాయతీ పోరులో మాత్రం దూకుడు చూపుతున్నారు. దగ్గరుండి పార్టీ మద్దతుదారులతో నామినేషన్లు వేయించడం, వారి గెలుపు బాధ్యతను తన భుజాన వేసుకుంటున్నట్లు ప్రకటించడంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. నియోజకవర్గంలో రెండు మేజర్ పంచాయతీలు ఉండగా, దాదాపు 30 వేల ఓట్లు ఆ రెండు పంచాయతీల పరిధిలో ఉన్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలంటే చీపురుపల్లి, కొండపాలెం మేజర్ పంచాయతీల్లో మెజార్టీ సాధించాల్సివుంటుందని అంటున్నారు.

ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఒక అడుగు వెనక్కి తగ్గి చిన్న శ్రీనుకు ఆ రెండు పంచాయతీలను అప్పగించాల్సివచ్చిందని అంటున్నారు. అటు బొత్స సైతం ఈ రెండు పంచాయతీలను తన వ్యక్తిగత ప్రతిష్టకు తీసుకున్నారని చెబుతున్నారు. జడ్పీటీసీ ఎన్నికల్లో కొండపాలెం మేజర్ పంచాయతీలోని మూడు ఎంపీటీసీ స్థానాలను వైసీపీ గెలుచుకోవడంతో అక్కడ ఆ పార్టీ పునాదులు గట్టిగా ఉన్నాయనే విషయాన్ని సూచిస్తోందని అంటున్నారు. చీపురుపల్లి పట్టణంలోని ఆరు ఎంపీటీసీ స్థానాలను టీడీపీ గెలుచుకుంది. అయితే ఓటింగ్ సరళిని గమనిస్తే ఇక్కడ టీడీపీ, వైసీపీ మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ ఉందని చెబుతున్నారు. అదేసమయంలో జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ ఎంపీ బెల్లాన కుమారుడికి మెజార్టీ వచ్చినట్లుగా విశ్లేషిస్తున్నారు.

ఈ నేపథ్యంలో చీపురుపల్లి పంచాయతీపై వైసీపీ జెండా ఎగరేయాలని మాజీ మంత్రి బొత్స పావులు కదుపుతున్నారు. పార్టీ మద్దతుదారు నామినేషన్ కార్యక్రమానికి స్వయంగా హాజరైన ఆయన కార్యక్రమానికి హాజరైన ఓటర్లను చూసి సంతృప్తి చెందారని అంటున్నారు. గెలుపుపై ఆశలు చిగురించడంతో అభ్యర్థికి ఆర్థికంగా భరోసా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో చీపురుపల్లి నియోజకవర్గంలో రెండు మేజర్ పంచాయతీ స్థానాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ స్థానాల్లో గెలిచిన పార్టీనే వచ్చే ఎమ్మెల్యే ఎన్నికల్లో హవా చూపే అవకాశం ఉండటంతో అందరి దృష్టి కేంద్రీకృతమైంది. మరోవైపు సీనియర్ నేత బొత్స, ఆయన మేనల్లుడు చిన్నశ్రీను రాజకీయ భవిష్యత్తు కూడా ఈ రెండు పంచాయతీలే నిర్దేశించనున్నాయని అంటున్నారు.

ఏపీ కాంగ్రెస్ లో ఏం జరుగుతోంది...రాహుల్ నజర్

ఏపీలో కాంగ్రెస్ ఉనికిపై మరోసారి చర్చ మొదలైంది. స్థానిక ఎన్నికల్లో పార్టీ ప్రభావం చూపలేకపోవడం, షర్మిల జగన్‌తో వ్యక్తిగత వివాదాలకే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ మద్దతు అంశం కూడా చర్చకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో ఏపీపై రాహుల్ గాంధీ ప్రత్యేక దృష్టి పెడతారనే ప్రచారం ఆసక్తికరంగా మారింది. ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఉందా అన్నది ఒక చర్చ అయితే ఆ పార్టీ పోరాటం ఎవరి మీద చేస్తోంది మరో చర్చ. అసలు ఈ పోరాటాలు అన్నీ ఆరాటాలేనా సొంత అజెండా వ్యక్తిగత లక్ష్యాలు కక్షలేనా అన్నది మరో కీలక ప్రశ్న. ఇవన్నీ కూడా ఏపీ కాంగ్రెస్ లో ఇంకా మిగిలి ఉన్న నిబద్ధత కలిగిన సీనియర్ నేతల నుంచి వస్తున్న సందేహాలు. అలాగే అసలు పార్టీలో ఏమి జరుగుతోంది అన్నది కూడా ఆందోళన కలిగించే వ్యవహారంగా చెబుతున్నారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న వైఎస్ షర్మిల వైసీపీ అధినేతగా ఉన్న వైఎస్ జగన్ ల మధ్య జరుగుతున్న వ్యక్తిగత వ్యవహారాలు ఆస్తులకు సంబంధించిన వివాదాలు ఇవన్నీ కాంగ్రెస్ పార్టీకి అవసరమా అన్నది కూడా మరో చర్చ. ఏపీలో చూస్తే కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్దగా ఉనికి చూపించింది ఏమీ లేదని విమర్శ ఉంది.

గుడ్డిలో మెల్లగా :

ఇక ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చీరాలలో మాత్రం కాంగ్రెస్ కాస్తా కనిపించింది అంటే అది మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ క్రెడిట్ లోకే వెళ్తుందని అంటారు. ఆయన తన సొంత బలంతోనే కాంగ్రెస్ ని అక్కడా కొద్దో గొప్పో నిలబెట్టగలిగారు. అది తప్పించి మొత్తం ఏపీ వ్యాప్తంగా కాంగ్రెస్ పోటీ చేసినా సోదిలోకి లేకుండా పోయింది అని అంటున్నారు. పీసీసీ చీఫ్ హోదాలో షర్మిల కాంగ్రెస్ ని పట్టించుకోలేదని కూడా



విమర్శలు ఉన్నాయి. ఇవన్నీ కూడా అసలైన కాంగ్రెస్ పార్టీ అభిమానులకు ఆవేదన కలిగిస్తున్నాయని అంటున్నారు.

డీకే సీఎం గా :

ఇక కర్ణాటకలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ ఉన్నారు. ఆ రాష్ట్రంలో షర్మిల పీసీసీ చీఫ్ గా ఉంటూ యలహంక ప్యాలెస్ లోకి వెళ్లాలని ప్రయత్నాలను అక్కడి పోలీసులు అడ్డుకోవడం కూడా చర్చనీయాంశం అవుతోంది. తమ సొంత పార్టీకి చెందిన పీసీసీ చీఫ్ అయినా కోర్టు ఆదేశాలను అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడానికే మొగ్గు చూపిందని కూడా గుర్తు చేస్తున్నారు. ఇక బెంగళూరు యలహంక ప్యాలెస్ చుట్టూ సాగుతున్న వివాదం ఇవన్నీ కూడా అక్కడి ప్రభుత్వానికి తెలియనివి కావని అంటున్నారు. ఆ విధంగా కాంగ్రెస్ పెద్దలకు ఫీడ్ బ్యాక్ వెళ్లే ఉంటుందని కూడా చెబుతున్నారు.

టీడీపీ మద్దతు మీద :

ఇక కాంగ్రెస్ నాయకురాలిగా ఉన్న షర్మిలకు టీడీపీ మద్దతుగా నిలవడం మీద కూడా చర్చ సాగుతోంది. చంద్రబాబుకు పెళ్ళి కార్డు షర్మిల అందించారు అన్న దాని మీద వైసీపీ సొంత మీడియా కథనాలు రాసింది. దాని మీద తప్పేముంది అని మాట్లాడటం వరకూ టీడీపీ పెద్దలు ఓకే కానీ అంతకు మించి అన్నట్లుగా షర్మిలకు మద్దతుగా నిలవడం టీడీపీ సొంత మీడియా కూడా ఆమె వైపు ఉండడం ఇవన్నీ చూసిన వారికి కేంద్రంలో ఎన్డీయే మీద కాంగ్రెస్ పోరాడుతూంటే ఏపీలో ఎన్డీయే మీద కాంగ్రెస్ ఏ మేరకు పోరాటం చేస్తోంది అన్నది కూడా చర్చిస్తున్నారు.

ఏం చేస్తారు :

దేశమంతా కాంగ్రెస్ గాలులు వీస్తున్నాయని దానిని అందిపుచ్చుకోవాలని జాతీయ స్థాయిలో ఆ పార్టీ పెద్దలు ప్రవచిస్తున్నారు మరి ఏపీలో కాంగ్రెస్ గాలి లేదా లేక వచ్చినా పట్టించుకోవడం లేదా లేక కాంగ్రెస్ నే ఏకంగా గాలికి వదిలేశారా అన్నది కూడా చర్చ సాగుతోంది. మరి ఏపీ మీద కాంగ్రెస్ ఫోకస్ పెడుతుందని కూడా మరోసారి చర్చ సాగుతోంది. అది భారీ మార్పులకు దారి తీస్తుందా లేక ఇంకా ఏమైనా జరుగుతుందా అనంది అయితే తెలియరావడం లేదు కానీ ఏపీ వైపు రాహుల్ గాంధీ చూపు ఉందని అంటున్నారు. ఈ ప్రచారంలో నిజమెంత అన్నది చూడాల్సి ఉంది.

ఇలాగైతే ఎలా సారూ...కేసీఆర్ ది వ్యూహమా ?

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు రెండేళ్లే సమయం ఉండగా, సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనలతో ప్రజల్లోకి వెళ్తున్నారు. కేటీఆర్, హరీష్ రావు పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు కేసీఆర్ మాత్రం ఇప్పటికీ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ఎన్నికలకు ఆరు నెలల ముందే జనంలోకి రావాలన్న కేసీఆర్ వ్యూహం ఎంతవరకు పనిచేస్తుందన్న చర్చ సాగుతోంది.

వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవుతారు అని బీఆర్ఎస్ నేతలు పదే పదే చెబుతున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అయితే ఇదే మాట అంటున్నారు. హరీష్ రావు అదే ధీమాను ప్రదర్శిస్తున్నారు. అంతా బాగానే ఉంది కానీ తెలంగాణలో సార్వత్రిక ఎన్నికలు జరిగి మూడేళ్ళు అయింది. అచ్చంగా మరో రెండేళ్ల కాలం మాత్రమే అసెంబ్లీ ఎన్నికలకు ఉంది. ఈ మూడేళ్ళలో కేసీఆర్ ఎక్కడా బయటకు వచ్చింది పెద్దగా లేదని అంటున్నారు. అంతే కాదు ఆయన అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. కానీ సభకు కూడా రావడం లేదు. కేసీఆర్ కేరాఫ్ ఫాం హౌస్ అని కాంగ్రెస్ నేతలు ఎద్దేవా చేస్తూనే ఉన్నారు. ఇంతలో మూడేళ్ళు ఇట్టే తిరిగిపోయాయి.

జనంలోకి రేవంత్ :

ఇదిలా ఉంటే జనంలోనే నిత్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉంటున్నారు. సీఎం గా ఆయనకు అధికారిక కార్యక్రమాలు ఎటూ ఉంటాయి. అయితే ఆయన అనేక జిల్లాలలో అధికారిక కార్యక్రమాలను నిర్వహిస్తూ జనాలకు కాంగ్రెస్ చేసిన మేలు చెబుతున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన నష్టాన్ని వివరిస్తున్నారు. అంతే కాదు



వారసత్వ రాజకీయాలను ఎండగడుతున్నారు. లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ని పూర్తిగా తప్పుపడుతున్నారు. తెలంగాణాకు అది గుదిబండగా మారింది అంటున్నారు. మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అటు క్యాడర్ లోనూ ఇటు జనాల్లోనూ ధీమా పెరిగేలా చేస్తున్నారు. ఇక సంక్రాంతి తరువాత జిల్లాల టూర్లు రేవంత్ రెడ్డి పెట్టుకుంటున్నారు. అలా ఎన్నికలకు రెండేళ్ళ ముందే రాష్ట్రమంతా చుట్టేయాలని ఆయన భారీ ప్లాన్ తోనే ఉన్నారు. అదే సమయంలో బలమైన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ అయితే తన గ్రాఫ్ ని ఏ మేరకు పెంచుకుంది అన్నదే చర్చకు వస్తున్న విషయం.

జోడు గుర్రాలుగా :

ఇక కేసీఆర్ అయితే ఫాం హౌస్ లో ఉన్నారు కానీ కేటీఆర్ హరీష్ రావు జనంలోనే ఉంటూ పార్టీని పటిష్టం చేసే పనిని గట్టిగానే తీసుకున్నారు. అసెంబ్లీలో అయినా లేదా జనంలో అయినా లేదా పార్టీ ఆఫీసుల్లో అయినా ఈ ఇద్దరు నేతలు జోడు గుర్రాల మాదిరిగా ఉంటూ బీఆర్ఎస్ ని లేపడానికి చూస్తున్నారు. అయితే వారు ఎంత కష్టపడుతున్నా కూడా గులాబీ పార్టీ గ్రాఫ్ అనుకున్న స్థాయిలో పెరుగుతోందా అన్నదే చర్చగా ఉంది. రేవంత్ రెడ్డి దూకుడు ముందు అయితే బీఆర్ఎస్ జోడీ తేలిపోతోంది అన్నది కూడా విశ్లేషణగా ఉంది. కేసీఆర్ అవతల వైపు ఉంటేనే మజా ఉంటుందని అంటున్నారు.

గులాబీ బాస్ స్ట్రాటజీ :

ఇక చూస్తే కేసీఆర్ సరిగ్గా ఎన్నికలకు ఆరు నెలల ముందు జనంలోకి రావాలనుకుంటున్నారా అన్నది చర్చగా ఉంది. అపుడు వస్తే ఊపు వస్తుందని కూడా భావిస్తున్నారు అని అంటున్నారు. అప్పటికి ఎన్నికల మూడ్ వస్తుందని జనాలు చెప్పేది పూర్తిగా వింటారు అని కూడా ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. అయితే ఇవన్నీ ఓల్డ్ స్ట్రాటజీస్ అని మరో మాట వినిపిస్తోంది. గతంలోలా ఎన్నికల ముందు వస్తే జనాలు టర్న్ కావడం లేదని కూడా గుర్తు చేస్తున్నారు. కనీసం రెండేళ్ల ముందు అయినా జనంలోకి వస్తేనే ప్రజలు కూడా ఆలోచిస్తారని ఎన్నికల హడావుడిలో ఎంత చెప్పినా అది రాజకీయ చర్చగానే ఉంటుందని కూడా అంటున్నారు. అయితే కేసీఆర్ మాత్రం ఇప్పటప్పట్లో వచ్చేది లేదనే అంటున్నారు. మరి చూడాలి బీఆర్ఎస్ కొత్త ఎత్తుగడలు ఏ విధంగా ఉండబోతున్నాయో.

జనసేన బలపడినట్లేనా ?

2019లో ఒక్క ఎమ్మెల్యేతో ప్రస్థానం ప్రారంభించిన జనసేన.. 2024లో 21 ఎమ్మెల్యేలు, రెండు ఎంపీ స్థానాలు సాధించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ 487 వార్డులు, 73 జెడ్పీటీసీలు, 938 ఎంపీటీసీలు గెలుచుకుంది. పలు మేయర్, ఎంపీపీ, వైస్ చైర్మన్ పదవులూ దక్కించుకుంది. కూటమిలో కొనసాగుతూనే రాష్ట్రవ్యాప్తంగా పార్టీని విస్తరించడంపై పవన్ వ్యూహాలు రచిస్తున్నారు.ఏపీలో జనసేన బలపడినట్లేనా. ఈ ప్రశ్న రాజకీయ విశ్లేషకులు కూడా వేసుకుని తరచి చూస్తున్నారు. ఇక జనసేనలో కూడా దీని మీద చర్చ సాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలలో జనసేనకు పొత్తులలో దక్కిన సీట్లలో గెలుపు బాట పట్టారు. అలాగే విశాఖ వంటి చోట్ల డిప్యూటీ మేయర్ పదవితో పాటు 26 మంది కార్పోరేటర్లు గాజు గ్లాస్ పార్టీకి దక్కాయి. విజయవాడ, ఏలూరు మేయర్ సీట్లు లభించాయి. అలాగే జనసేనకు జిల్లా పరిషత్తులు అయిదు దాకా సొంతం అయ్యాయి. మునిసిపాలిటీలు తీసుకుంటే జనసేనకు దక్కినవి పోటీ చేసిన 15 మున్సిపాలిటీలు 3 నగర పంచాయతీలు ఖాతాలో పడ్డాయి.

గ్రౌండ్ లెవెల్ లో :

ఇక రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 100 పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి 3 వేల 942 వార్డులలో ఎన్నికల్లో జనసేన మొత్తం 487 వార్డుల్లో విజయం సాధించింది. జెడ్పీటీసీలు ఎంపీటీసీలు చూసుకుంటే జనసేన గెలుచుకున్నవి 73 జెడ్పీటీసీ 938 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇక ఏకగ్రీవమైన స్థానాలతో కలిపితే జనసేన మొత్తం బలం మరింత ఎక్కువగా ఉంది. ఎంపీపీ పదవులు కూడా జనసేనకు దక్కినవి 42 ఎంపీపీ పదవులు 83 వైస్ ఎంపీపీ పదవులు దక్కాయి. జెడ్పీలలో వైఎస్ చైర్మన్లు జనసేనకు 5 దాకా లభించాయి. ఇక మునిసిపాలిటీలలో 18 వైఎస్ చైర్ పర్సన్ పదవులు కూడా ఆ పార్టీ అందుకుంది. ఇక రెండవ విడతలో జరితే 23 పట్టణాలలో జనసేనకు కీలకమైన సీట్లు దక్కే చాన్స్ ఉంది.

పంచాయతీలు సైతం :

అదే విధంగా ఏపీలో 13 వేల పై చిలుకు ఉన్న పంచాయతీలలో కూడా జనసేనకు భారీగానే అవకాశాలు దక్కుతాయని అంటున్నారు. మొత్తంగా చూస్తే 2019లో కేవలం ఒక ఎమ్మెల్యేతో తన అధికార ప్రయాణాన్ని ప్రారంభించిన జనసేన 2024 ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని 21 ఎమ్మెల్యేలు రెండు లోక్ సభ, ఒక రాజ్యసభ, రెండు ఎమ్మెల్సీలు, అలాగే పలు నామినేటెడ్ పోస్టులు దక్కించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో మరింతగా పటిష్టం అయింది అని అంటున్నారు.

అసంతృప్తి ఉందా :

అయితే జనసేన ఒక రాజకీయ పార్టీగా పూర్తి స్థాయిలో ఎదగాలని చూస్తోంది. ఆ పార్టీ కూడా వైసీపీ టీడీపీ మాదిరిగా రాష్ట్రమంతా విస్తరించి ఏదో నాటికి ఏపీలో అధికారం అందుకోవాలని ఆలోచిస్తోంది. మరీ ముఖ్యంగా క్యాడర్ లో ఈ భావన అధికంగా ఉంది. అయితే జనసేనకు కూటమిలో టీడీపీ తరువాత ప్రాధాన్యత బాగానే లభిస్తోంది అని అంటున్నారు. కానీ రాజకీయ పార్టీలకు ఆకాంక్షలు ఉంటాయి కాబట్టి ఇది చాలదనే చర్చ ఎపుడూ ఉంటుంది. అదే సమయంలో జనసేన బలం ఇంకా ఎక్కువగా ఉందని కూడా చర్చ సాగుతోంది. సోషల్ మీడియాలో చూస్తే ఈ రకమైన పోస్టులు కనిపిస్తాయి. నిజంగా జనసేనకు ఎక్కువగానే బలం ఉండొచ్చు కానీ కూటమిలో పొత్తుల ధర్మంతోనే ఈ పోటీ చేసింది అన్నది కూడా గుర్తుంచుకోవాలని అంటున్నారు.

పవన్ వ్యూహాత్మకంగానే :

ఇక అధినేత పవన్ వ్యూహాత్మకంగానే ముందుకు సాగుతున్నారు. ఆయన నెమ్మదిగానే పార్టీని విస్తరించుకుని వెళ్తున్నారు. 2019 నుంచి 2026 దాకా సాగిన ఏడేళ్ల జనసేన అధికార ప్రయాణంలో ఇన్ని పదవులు ఈ గ్రోత్ అన్నది నిజంగా హర్షించతగినదే అని అంటున్నారు. కానీ ఇక్కడితో ఆగిపోకూడదు అన్నది కూడా ఉంది. అదే సమయంలో రాష్ట్రంలో రాజకీయాలను విపక్షంలో ఉన్న వైసీపీని రాష్ట్ర అభివృద్ధిని అన్నింటినీ దృష్టిలో ఉంచుకునే జనసేన తగిన విధంగా వ్యవహరిస్తోంది అని అంటున్నారు. పవన్ కూడా వ్యూహాత్మకంగానే అడుగులు వేస్తున్నారు అని చెబుతున్నారు. కూటమితో కొనసాగుతూనే జనసేన మరింతగా ఎలా విస్తరించాలి అన్నది జనసేన అధినాయకత్వం కార్యాచరణ రూపొందించుకుంటోందని చెబుతున్నారు. ఏది ఏమైనా ఇపుడు చూస్తే ఏపీలో టీడీపీ తరువాత ఎక్కువగా అధికార పదవులు జనసేనకే ఉన్నాయి. అలా వైసీపీని మూడవ ప్లేస్ లోకి పంపించారనే అంటున్నారు.

వంగవీటి రాధాక్రిష్ణన్...ఈ కొత్త పేరేంటి ?



విజయవాడ మేయర్‌గా ప్రమాణ స్వీకారం సందర్భంగా వంగవీటి రాధా తన పూర్తి పేరు 'వంగవీటి రాధాకృష్ణన్' అని పలకడంతో అందరిలో ఆసక్తి మొదలైంది. చిన్నప్పుడు ఊటీలో చదువుకున్న సమయంలో పాఠశాల రికార్డుల్లో తమిళ శైలిలో పేరు చివర 'న్' చేరింది. అప్పటి నుంచి విద్యా ధ్రువపత్రాలు, పాస్‌పోర్ట్, ఎన్నికల అఫిడవిట్లలో అదే పేరు కొనసాగుతోంది. అందుకే ప్రమాణ స్వీకారంలో అధికారిక పేరును ఉపయోగించారు.వంగవీటి రాధా క్రిష్ణ అంటే అందరికీ తెలుసు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా 2004లో గెలిచిన రాధా క్రిష్ణ దివంగత నేత వంగవీటి రంగా కుమారుడు అన్నది ఇంకా బాగా తెలుసు. షార్ట్ కట్ లో రాధా అని కూడా బాగా పాపులర్. కానీ విజయవాడ మేయర్ గా ఆయన ప్రమాణం చేస్తున్నప్పుడు తన పేరు వంగవీటి రాధాకృష్ణన్ అని పలికారు. దాంతో సభలో ఉన్న వారు ఏమిటి ఆయన తప్పు చదువుతున్నారా లేక తాము తప్పుగా విన్నామా అన్న డౌట్ లో పడిపోయారు. అయితే రాధా తన పేరుని కరెక్ట్ గానే చదివారు అని అంతా కరెక్ట్ గానే విన్నారు అన్నది తరువాత తెలిసింది. మరి రాధా క్రిష్ణ అన్న తెలుగు పేరు కదా ఈ తమిళ్ కలిసిన క్రిష్ణన్ అన్న పేరు ఎలా వచ్చింది అన్నదే ఇపుడు అంతా ఆలోచిస్తున్నారు. అయితే ఈ పేరు వెనక ఒక స్టోరీ ఉంది. అది ఇంట్రెస్టింగ్ గానే ఉంది.

ప్రభుత్వ రికార్డులలో :

జనాలందరికీ రాధా క్రిష్ణగా పేరుతో పరిచయం ఉన్నా ఆయన పూర్తి పేరు వంగవీటి రాధాక్రిష్ణన్. అలాగే ఆయన పేరు ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. అందుకే విజయవాడ నగర పాలక సంస్థ నూతన మేయర్‌గా ఆయన ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వంగవీటి రాధాకృష్ణన్ అనే నేను అని పలికారు. అయితే ఈ కొత్త పేరుపై చర్చ అంతటా మొదలైంది. కానీ దీని వెనుక ఉన్న అసలు కారణం ఉంది. స్కూల్ రికార్డుల ప్రకారం అదే పేరు ఉంది. రాధా తల్లిదండ్రులు మొదట వంగవీటి రాధాకృష్ణ అనే పేరు పెట్టారు. అది రాధా పెద నాన్న పేరు. అయితే రాధాని ఆయన చిన్నతనంలో తమిళనాడులోని ఊటీలో పాఠశాలలో చదివించారు. అలా ఆయన చదువుకునే సమయంలో అక్కడ పాఠశాల అధికారులు తమిళ శైలిలో ఆయన పేరు చివర 'న్' చేర్చి రాధాకృష్ణన్ గా స్కూల్ రికార్డులలో నమోదు చేశారు.

అదే పేరు కొనసాగుతోంది :

ఆ తరువాత అదే కొనసాగుతూ అధికారిక ధృవపత్రాలలోనూ ఉంది. అప్పటి నుంచి ఆయన చదువుకున్న సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్, ఎన్నికల అఫిడవిట్లు ఇతర ప్రభుత్వ రికార్డులన్నింటిలోనూ అదే పేరు కొనసాగుతోంది. ఇక బయట ప్రజలకు, రాజకీయ వర్గాలకు ఆయన వంగవీటి రాధా లేదా రాధాకృష్ణగా సుపరిచితులైనప్పటికీ, చట్టపరమైన నిబంధనల ప్రకారం మేయర్ ప్రమాణ స్వీకారంలో తన అధికారిక పేరునే ఉపయోగించారు. అదన్న మాట సంగతి. మొత్తం మీద చూస్తే వంగవీటి రాధా క్రిష్ణన్ అన్నది ఆయన అసలు పేరు అని మేయర్ ప్రమాణం సందర్భంగా అంతా సరి కొత్తగా తెలుసుకున్నారు. దేశ ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాక్రిష్ణన్ ఉన్నారు. అలాగే . ఇపుడు విజయవాడ మేయర్ గా రాధాక్రిష్ణన్ ఉన్నారు అని అంతా అంటున్నారు. తమిళనాడులో పుట్టి దేశానికి రాష్ట్రపతి అయిన రాధాక్రిష్ణన్ స్ఫూర్తితో అనేక మంది ఆ పేరుని పెట్టుకుంటారు ఇది ఎక్కువగా తమిళనాడులో జరుగుతుంది.

పెన్ పవర్

బుధవారం 25 నవంబర్ 2026

వైభవ్ విశ్వరూపం

52 బంతుల్లో డబుల్ సెంచరీ.. 28 సిక్సర్లతో సునామీ.. ప్రపంచ రికార్డులన్నీ గల్లంతు!



ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని సరికొత్త విధ్వంసం నమోదైంది. భారత టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ బంతిని బాదుడే బాదుడు అన్నట్లుగా విరుచుకుపడుతూ పలు అంతర్జాతీయ, దేశవాళీ రికార్డులను తుడిచిపెట్టేశాడు. కేవలం 52 బంతుల్లోనే డబుల్ సెంచరీ (ద్విశతకం) బాది ప్రపంచ వన్డే క్రికెట్‌ను నివ్వెరపరిచాడు. లిస్ట్-ఏ వన్డే చరిత్రలోనే అత్యంత వేగవంతమైన ద్విశతకంగా ఇది చరిత్రకెక్కింది. అంతకుముందు చాడ్ బోవ్స్ 103 బంతుల్లో నెలకొల్పిన ప్రపంచ రికార్డును సూర్యవంశీ సగానికి సగం బంతుల్లోనే బద్దలు కొట్టడం గమనార్హం. గతంలో ఎన్ జగదీశన్ (114 బంతులు), హ్యారీ బ్రూక్ (114 బంతులు) పేరిట ఉన్న రికార్డులన్నీ ఈ సునామీ ధాటికి కొట్టుకుపోయాయి. దోహా వేదికగా యూఏఈతో జరిగిన ఏసీసీ మెన్స్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 గ్రూప్-బి పోరులో వైభవ్ బ్యాటింగ్‌కు ప్రత్యర్థి బౌలర్లు బెంబేలెత్తిపోయారు. క్రీజులోకి వచ్చిన క్షణం నుంచే సిక్సర్ల వర్షం కురిపించిన సూర్యవంశీ.. ఒకే ఇన్నింగ్స్‌లో ఏకంగా 28 సిక్సర్లు బాది యావత్ ప్రొఫెషనల్ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక సిక్సర్ల ఆల్‌టైమ్ వరల్డ్ రికార్డును లిఖించాడు. 2024 రంజీ ట్రోఫీలో హైదరాబాద్ బ్యాటర్ తన్మయ్ అగర్వాల్ కొట్టిన 26 సిక్సర్ల రికార్డును అతడు అధిగమించాడు. న్యూజిలాండ్ విధ్వంసకర బ్యాటర్ కొలిన్ మన్రో (23 సిక్సర్లు), ఆస్ట్రేలియా ప్లేయర్ డార్సీ షార్ట్ (23 సిక్సర్లు) సాధించిన మైలురాళ్లను కూడా వైభవ్ సునాయాసంగా దాటేశాడు.

వైభవ్ ఆడిన ఈ నమ్మశక్యం కాని ఇన్నింగ్స్‌లో మొదట కేవలం 16 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ తర్వాత సునామీలా విరుచుకుపడుతూ 28 బంతుల్లో సెంచరీ కొట్టి లిస్ట్-ఏ క్రికెట్లో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు బద్దలు కొట్టాడు. ఆ తర్వాత 40 బంతుల్లో 150 మార్కును అందుకున్నాడు. ఇది కూడా ఓ రికార్డే. అక్కడితో ఏమాత్రం ఆగకుండా అదే జోరు కొనసాగిస్తూ 52 బంతుల్లోనే 200 పరుగుల మార్కును దాటి రికార్డులను తిరగరాశాడు. లిస్ట్-ఏ చరిత్రలో వేగవంతమైన సెంచరీ, ఫాస్టెస్ట్ 150, అత్యంత వేగవంతమైన డబుల్ సెంచరీ.. ఇలా అన్ని రికార్డులనూ ఒకే మ్యాచ్‌లో కొల్లగొట్టిన ఏకైక బ్యాటర్‌గా నిలిచాడు. వైభవ్ ధాటికి ఇండియా-ఏ కేవలం 5 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసుకుని సరికొత్త జట్టు రికార్డును సైతం నమోదు చేసింది.

మ్యాచ్ వన్ సైడెడ్ ఇలా అయింది!

తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న యూఏఈ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది. ఆరంభంలోనే హర్షిత్ రాణా, అర్నద్ ఖాన్ చెలరేగడంతో 20 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ యూఏఈని మాజీ భారత దేశవాళీ బ్యాటర్ హర్‌ప్రీత్ సింగ్ భాటియా అద్భుత శతకంతో ఆదుకున్నాడు. హర్‌ప్రీత్ 144 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 130 పరుగులు సాధించి జట్టుకు భారీ స్కోరు అందించగా.. మహ్మద్ షహదాద్ (28), ఏతాన్ డిసౌజా (25), చివర్లో కెప్టెన్ బాసిల్ హమీద్ (నాటౌట్ 36) అతడికి విలువైన సహకారం అందించారు. భారత బౌలర్లలో అర్నద్ ఖాన్ 10 ఓవర్లలో 43 పరుగులిచ్చి 4 వికెట్లతో సత్తా చాటగా.. హర్షిత్ రాణా, సూర్యాంశ్ షెడ్గే, హర్ష్ దూబే, షాబాజ్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం భారత బ్యాటర్లలో వైభవ్ 53 బంతుల్లో 204 పరుగులు చేసి ఔటయ్యాడు. ఛేదించాల్సిన లక్ష్యాన్ని దాదాపు ఒక్కడే పూర్తి చేశాడు. అభిషేక్ శర్మ (12), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (3) తక్కువ పరుగులకే వెనుదిగిరారు. రింకూ సింగ్ 27, కుమార్ కుషాగ్ర 1 నాటౌట్‌గా నిలిచి 14.2 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు.

బౌల్ట్‌ను వదిలేసి అర్ష్‌దీప్‌ను తీసుకోవడం కరెక్టేనా?: ముంబయి ఇండియన్స్ మాస్టర్ ప్లాన్‌పై ఇర్ఫాన్ పఠాన్ విశ్లేషణ!



ఐపీఎల్ 2027 మినీ వేలానికి ముందు ముంబై ఇండియన్స్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయాలను టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ఆసక్తికరంగా విశ్లేషించాడు. భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ జట్టులోకి వచ్చిన తర్వాత న్యూజిలాండ్ స్టార్ పేసర్ ట్రెంట్ బౌల్ట్‌ను వదులుకోవడం సరైన నిర్ణయమేనని సమర్థించాడు. అయితే ఆఫ్ఘనిస్థాన్ యువ స్పిన్నర్ అల్లా ఘజన్‌ఫర్‌ను రిలీజ్ చేయడం మాత్రం తనను ఆశ్చర్యపరిచిందని జియోస్టార్‌తో మాట్లాడుతూ పఠాన్ పేర్కొన్నాడు.విదేశీ లెఫ్ట్‌ఆర్మ్ పేసర్ అయిన బౌల్ట్ స్థానంలో స్వదేశీ లెఫ్ట్‌ఆర్మ్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ జట్టులోకి వచ్చాడని, ఇది విదేశీ ఆటగాళ్ల కాంబినేషన్‌ను సరిదిద్దుకునేందుకు ముంబైకి ఎంతో వెసులుబాటు కల్పిస్తుందని పఠాన్ విశ్లేషించాడు. అలాగే తరచూ గాయాలపాలవుతూ పూర్తి సీజన్లు ఆడలేకపోతున్న పేసర్ దీపక్ చాహర్‌ను రిలీజ్ చేయడం కూడా అర్థం చేసుకోదగినదేనని స్పష్టం చేశాడు. కొత్త బంతితో వికెట్లు తీసే స్పెషలిస్ట్ బౌలర్ ఇప్పటికే జట్టులో ఉన్నప్పుడు చాహర్‌ను పక్కనపెట్టడం సరైన నిర్ణయమేనన్నాడు. కానీ, మిచెల్ శాంట్నర్‌తో కలిసి ఇరువైపులా విదేశీ స్పిన్ దాడి చేసేందుకు అల్లా ఘజన్‌ఫర్ సరైన ప్రత్యామ్నాయంగా ఉండేవాడని, అతడిని వదులుకోవడమే ఆశ్చర్యంగా ఉందని తెలిపాడు.ఈ మార్పులు చేసినప్పటికీ ముంబై బౌలింగ్ విభాగం ఇప్పటికే అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోందని పఠాన్ అభిప్రాయపడ్డాడు. భారీ పర్స్ బ్యాలెన్స్‌తో వేలానికి వెళుతున్న ఐదుసార్లు ఛాంపియన్ ముంబై.. ఎప్పటిలాగే ఊహించని కొత్త టాలెంట్‌ను వెలికితీసి అందరినీ ఆశ్చర్యపరుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశాడు. పెద్ద బడ్జెట్‌తో మినీ వేలంలోకి అడుగుపెట్టిన ప్రతిసారీ ముంబై ఇండియన్స్ ఏదో ఒక అద్భుతం చేస్తుందని, ఈసారి వేలంలో ఫ్రాంచైజీ ఆ నిధులను ఎలా వినియోగిస్తుందో చూడటానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని పఠాన్ ముగించాడు.

బంతికి ఉమ్మి: శుభ్‌మన్ గిల్ విజ్ఞప్తిని తోసిపుచ్చిన ఐసీసీ!



అంతర్జాతీయ క్రికెట్‌లో బంతికి ఉమ్మి (సలైవా) వాడకంపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసే ప్రసక్తే లేదని ఐసీసీ స్పష్టం చేసింది. ఈ నిబంధనను పునఃసమీక్షించాలని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చేసిన విజ్ఞప్తిని ఐసీసీ తోసిపుచ్చింది. ఆరోగ్యం, క్రీడాస్ఫూర్తికి సంబంధించిన ఆందోళనల నేపథ్యంలో ఈ విషయంలో తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని ఐసీసీ వర్గాలు 'ఇండియా టుడే'కు వెల్లడించాయి.వెల్లింగ్‌టన్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టు డ్రాగా ముగిసిన తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ అంశాన్ని ప్రస్తావించాడు. బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్‌పై కూకబుర్రా బంతి త్వరగా మెత్తబడుతోందని, బౌలర్లకు ఏమాత్రం సహకరించడం లేదని గిల్ అసహనం వ్యక్తం చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో బంతికి ఉమ్మిని వాడేందుకు అనుమతిస్తే బౌలర్లకు కొంత ప్రయోజనం కలిగేదని అభిప్రాయపడ్డాడు. "కోవిడ్ కాలం ముగిసి చాలా ఏళ్లయింది. అయినా ఇప్పటికీ బంతిపై ఉమ్మిని ఎందుకు వాడనివ్వడం లేదో అర్థం కావడం లేదు" అని గిల్ వ్యాఖ్యానించాడు.అయితే, గిల్ వాదనను ఐసీసీ పరిగణనలోకి తీసుకోలేదు. 2020లో కోవిడ్-19 మహమ్మారి కారణంగా ఆటగాళ్ల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ నిషేధాన్ని తాత్కాలికంగా ప్రవేశపెట్టారు. ఆ తర్వాత దీనిని శాశ్వత నిబంధనగా మార్చారు. మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) నిబంధనల ప్రకారం కూడా బంతి స్వరూపాన్ని మార్చేందుకు ఉమ్మిని వాడటం అనుచిత ప్రవర్తన కిందకే వస్తుంది.ఉమ్మిని వాడటాన్ని పర్యవేక్షించడం కష్టమని, కొందరు ఆటగాళ్లు స్వీట్లు, చూయింగ్ గమ్ వంటి పదార్థాలతో కలిపి ఉమ్మిని బంతికి పూసి అక్రమంగా ప్రయోజనం పొందే ప్రమాదం ఉందని ఐసీసీ భావిస్తోంది. ఇది ఇప్పటికీ ఆటగాళ్లు, అంపైర్ల ఆరోగ్యానికి ముప్పు కలిగించే అంశంగానే చూస్తోంది.ఆసక్తికరంగా, ఐపీఎల్ 2025 సీజన్ నుంచి ఈ సలైవా నిషేధాన్ని ఎత్తివేసింది. అయితే, ఇది దేశీయ టోర్నీ కావడంతో దాని ప్రభావం అంతర్జాతీయ క్రికెట్‌పై ఉండదు. ఐసీసీ నిబంధనల్లో మార్పు తీసుకురావాలంటే, ఏదైనా సభ్య దేశం సంబంధిత కమిటీ ద్వారా ప్రతిపాదన చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం సలైవా బ్యాన్‌పై ఎలాంటి చర్చలు జరగడం లేదని, ఈ నిషేధం యథాతథంగా కొనసాగుతుందని ఐసీసీ స్పష్టం చేసింది.

విచిత్రంగా పోరుగున ఫేమస్ అయిన స్టార్లు





సొంత భాషలో ఆశించిన విజయాలు అందుకోకపోయినా ఇతర పరిశ్రమల్లో స్టార్‌డమ్ సంపాదించిన నటులు ఎందరో ఉన్నారు. దుల్కర్ సల్మాన్ తెలుగులో వరుస విజయాలతో క్రేజ్ తెచ్చుకోగా.. విశాల్, కార్తీ, ధనుష్, విజయ్ ఆంటోనీకి కూడా మంచి మార్కెట్ ఏర్పడింది. రానా, సుధీర్ బాబు హిందీలో గుర్తింపు పొందారు. రజనీకాంత్, అర్జున్, సుమన్ ప్రయాణాలూ భాషా సరిహద్దులు స్టార్‌డమ్‌కు అడ్డుకావని చాటుతున్నాయి.

భారతీయ సినీ చరిత్రలో సొంత భాషలో కంటే పొరుగు పరిశ్రమల్లో అడుగుపెట్టి తిరుగులేని క్రేజ్- స్టార్ ఇమేజ్ అందుకున్న నటులు ఎందరో ఉన్నారు. ఒక నటుడి ప్రతిభకు భాషా సరిహద్దులు అడ్డుకావని.. సరైన కథ, ప్రేక్షకుల ఆదరణ తోడైతే పరాయి గడ్డపైనా విచిత్రమైన రీతిలో అద్భుత విజయాలు సాధ్యమవుతాయని వీరి ప్రస్థానం నిరూపిస్తోంది. ప్రస్తుత తరంలో మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ విషయంలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది. మాతృభాష మలయాళంలో ఇటీవల వరుస పరాజయాలు ఎదురైనా తెలుగులో మాత్రం మహానటి, సీతారామం, లక్కీ భాస్కర్ వంటి చిత్రాలతో హ్యాట్రిక్ బ్లాక్‌బస్టర్లు అందుకుని .. లేటెస్టుగా -ఆకాశంలో ఒక తార-తో మరో బ్లాక్ బస్టర్ ఖాతాలో వేసుకుని టాలీవుడ్‌లో లోకల్ హీరోల స్థాయిలో ఫాలోయింగ్ సంపాదించుకున్నారు.ఇదే తరహాలో కోలీవుడ్ హీరోలైన విశాల్, కార్తీ, ధనుష్, విజయ్ ఆంటోనీ లకు తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. గతంలో పందెంకోడి సినిమాతో విశాల్ తమిళం కంటే తెలుగులోనే విపరీతమైన క్రేజ్ తెచ్చుకోగా.. ఆ తర్వాత కూడా తమిళంలో ఫ్లాపులు వచ్చిన ప్రతిసారీ తెలుగు బాక్సాఫీస్ వద్ద విజయాలు అందుకున్నాడు. ఇక విజయ్ ఆంటోనీ నటించిన బిచ్చగాడు తమిళంలో సాధారణ విజయం సాధిస్తే... తెలుగులో మాత్రం సంచలన వసూళ్లతో అతడికి తిరుగులేని మార్కెట్‌ను సృష్టించింది. అదేవిధంగా ఊపిరి, ఖైదీ, సర్దార్ వంటి చిత్రాలతో కార్తీ తమిళం కంటే తెలుగులోనే ఎక్కువ ఆదరణ పొందగా.. ఇటీవల సార్, కుబేర వంటి సినిమాలతో ధనుష్ సైతం తెలుగులో తన మార్కెట్‌ను బలంగా విస్తరించుకుంటున్నారు. మరోవైపు.. తెలుగు పరిశ్రమకు చెందిన రానా దగ్గుబాటి, సుధీర్ బాబు వంటి హీరోలు ఉత్తరాదిన బాలీవుడ్‌లో తమదైన ముద్ర వేశారు. తెలుగులో హీరోలుగా కొనసాగుతూనే.. హిందీలో దమ్ మారో దమ్, బేబీ, ఘూజీ వంటి చిత్రాలతో రానా దగ్గుబాటి..

టైగర్ ష్రాఫ్‌తో కలిసి చేసిన -బాఘీ- సినిమాతో సుధీర్ బాబు దేశవ్యాప్తంగా గొప్ప గుర్తింపు, ప్రశంసలు అందుకున్నారు. వీరితో పాటు మహారాష్ట్రకు చెందిన సాయాజీ షిండే, మురళీ శర్మ వంటి విలక్షణ నటులు హిందీ, మరాఠీ చిత్రాల్లో నటించినా.. వారికి అసలైన గుర్తింపు.. స్టార్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ హోదా దక్కింది మాత్రం తెలుగు సినిమాల ద్వారానే కావడం విశేషం.సీనియర్ తరం నటులను గమనిస్తే.. కన్నడ నేపథ్యం నుంచి వచ్చిన రజనీకాంత్, అర్జున్, సుమన్ వంటి దిగ్గజాలు కూడా ఇతర భాషల్లోనే తమ అసలైన స్టార్‌డమ్‌ను నిర్మించుకున్నారు. బెంగళూరులో కండక్టర్‌గా పనిచేసిన రజనీకాంత్ తమిళంలోకి అడుగుపెట్టి -సూపర్ స్టార్-గా ఎదిగితే... కర్ణాటకలో కెరీర్ ప్రారంభించిన అర్జున్ తమిళ, తెలుగు భాషల్లో జెంటిల్‌మన్, ఒకే ఒక్కడు వంటి చిత్రాలతో -యాక్షన్ కింగ్-గా మారారు. అలాగే మంగళూరుకు చెందిన సుమన్ సైతం తెలుగు ప్రేక్షకుల ఆదరణతో 80వ దశకంలో అగ్ర హీరోగా వెలుగొందారు.

సొంత గడ్డపై ఆశించిన స్థాయిలో కలిసిరాకపోయినా.. పొరుగు పరిశ్రమల ప్రేక్షకుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న ఈ నటుల ప్రయాణం ఎంతో ఆసక్తికరం. ప్రతిభ, కష్టపడే తత్వం ఉంటే ఏ భాషలోనైనా ప్రేక్షకులు అక్కున చేర్చుకుంటారని.. భారతీయ సినిమాలో భాష కంటే భావోద్వేగమే ముఖ్యమని వీరి విజయగాథలు మరోసారి చాటిచెబుతున్నాయి.



స్టైలిష్ బ్లూ డెనిమ్ జంప్‌సూట్‌లో మెరిసిపోయిన ఐషా శర్మ - ఫోటోషూట్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com